




# అక్షర రేఖ
తెలుగు దినపత్రిక
Simultaneously Published from Adilabad
RNI NO. TELTEL /2012/44706

శనివారం 11 ఏప్రిల్ 2026 | Akshara Rekha Telugu Daily | వెల : రూ.2/- | సంపుటి : 13 | సంపుటి : 313 | పేజీలు : 8


## అన్నా నన్ను దేవుడే పంపిండు మీతో కలిసి
# పని చేయమని..

- జీవన్‌రెడ్డి భావోద్వేగం
- ' తెలంగాణకు నష్టం జరుగుతున్న సమయంలో మీతో కలిసి పనిచేయాల్సిన అవసరమున్నది
- మీతో కలిసి పనిచేయమని దేవుడే నన్ను మీదగ్గరికి పంపించిండు
- చాలా గ్యాప్ తర్వాత ఇన్నాళ్ల కైనా మీతో కలిసిపనిచేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది'





సిద్దిపేట

బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్య మంత్రి కేసీఆర్‌ను మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి కేసీఆర్‌ను పలకరిస్తూ భావోద్వేగానికి లోనయ్యారు. 'అన్నా.. నన్ను దేవుడే పంపిండు. మీతో కలిసి పని చేయమని' అంటూ కేసీఆర్‌ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన జీవన్ రెడ్డి , కుమారులు, జగిత్యాల జడ్పీ మాజీ చైర్ పర్సన్ వసంత సురేశ్ దంపతులు కేసీఆర్‌ను కలిసినవారిలో - మిగతా3లో



## రాజ్యసభ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసిన నీతీశ్ కుమార్

- నీతీశ్ చేత ప్రమాణస్వీకారం చేపించిన రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్
- హిందీలో ప్రమాణం చేసిన నీతీశ్ కుమార్
- కార్యక్రమానికి హాజరైన కేంద్రమంత్రులు జేపీ నడ్డా, నిర్మలా సీతారామన్

## ఇంధన భద్రతపై గల్ఫ్ దేశాలతో చర్చలు

- పశ్చిమాసియాలోని పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నాం
- దేశ ఇంధన భద్రతను బలోపేతం చేసేందుకు కేంద్ర మంత్రులు గల్ఫ్ దేశాల్లో పర్యటిస్తున్నారు
- భారత విదేశాంగ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్

## ఆర్టీసీ ఉద్యోగులకు
# శుభవార్త

### డీఏ 2.1 శాతం పెంచుతున్నట్లు ప్రకటించిన మంత్రి పొన్నం

- ఆర్టీసీ ఉద్యోగులకు ప్రస్తుతం ఉన్న 50.7 శాతం డీఏను 52.8 శాతానికి పెంపు
- ఈ ఏడాది జనవరి 1 నుంచి వర్తింపు
- రూ.2.82 కోట్ల అదనపు భారం
- ఉద్యోగులకు రూ. కోటి ప్రమాద బీమా
- పెరిగిన డీఏను వరుసగా మూడు నెలలకు ఒక్కో నెలలో సప్లిమెంటరీ బిల్స్ ద్వారా ప్రభుత్వం ఉద్యోగుల ఖాతాల్లో జమ




హైదరాబాద్

తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఉద్యోగుల డీఏను 2.1 శాతం పెంచుతున్నట్లు శుక్రవారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. పెరిగిన డీఏ ఈ ఏడాది జనవరి నుంచే అమలు అవుతుందని స్పష్టం చేశారు. ఇంతకు ముందు ఆర్టీసీ - మిగతా3లో

## గృహ గణనలో ఇప్పటికే 5.72 లక్షల కుటుంబాల సెల్ఫ్ ఎన్యుమరేషన్




- స్మార్ట్‌గా, సౌకర్యవంతంగా లక్షలాది కుటుంబాల స్వీయ గణన
- జనగణన డిజిటల్ సదుపాయాల్లో పెరుగుతున్న ప్రజా భాగస్వామం
- 5.72 లక్షల కుటుంబాల సెల్ఫ్ ఎన్యుమరేషన్ : ఆర్‌జీఐ
- ప్రత్యేక మొబైల్ యాప్ – ప్రతీ కుటుంబానికి 33 ప్రశ్నలు
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సెల్ఫ్ ఎన్యుమరేషన్ వేర్వేరు తేదీల్లో జరగనుంది
- ఆంధ్రప్రదేశ్‌లో సెల్ఫ్ ఎన్యుమరేషన్ కాలపరిమితి ఏప్రిల్ 16 నుంచి ఏప్రిల్ 30 వరకు ఉంటుంది.



## ఎన్నికల వేళ మోదీ గిమ్మిక్కులు

- నియోజకవర్గాల పునర్విభజనతో పెను ముప్పు: ఖర్గే
- మహిళా రిజర్వేషన్ల అమలులో కుట్ర
- నియోజక వర్గాల పునర్విభజనపై విపక్షాల ఉమ్మడి పోరుకు ఖర్గే పిలుపు

# ముంచేస్తోన్న డ్రగ్స్




- పల్లెల్లోనూ పెరిగిన గంజాయి వినియోగం
- ఈగల్ ఫోర్స్ సర్వేలో సంచలన విషయాలు
- పల్లెల్లోనూ విరివిగా గంజాయి సరఫరా
- మత్తుకు బానిసవుతున్నవారిలో 35 ఏళ్ల లోపు వారే అధికం
- అవగాహన లేక పెరుగుతున్న మత్తు వినియోగం
- విద్యాభ్యాసం నుంచే అవగాహన కల్పించాలంటున్న నిపుణులు



హైదరాబాద్

రంగుల కలలతో సాగిపోవాల్సిన యువత ప్రస్తుతం మత్తు ఊబిలో కూరుకుపోతోంది. ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాల్సిన వయస్సులో మత్తుకు బానిసవుతున్నారు. ఒకప్పుడు మహానగరాలకే పరిమితమైన మాదక ద్రవ్యాల వినియోగం నేడు పల్లెలకు కూడా ఎగబాకుతోంది. మత్తు సామ్రాజ్యాన్ని కూకటి వేళ్లతో పెకిలించేందుకు రంగంలోకి దిగిన ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్‌లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈగల్) ఫోర్స్ తాజా సర్వేలో సంచలన విషయాలు బయటపడ్డాయి. ఇంతకీ సర్వేలో వెలువడిన విషయాలేంటి మత్తు పదార్థాలకు బానిసవుతున్న వారిలో ఎక్కువగా ఎవరున్నారు - మిగతా3లో

## ధనిక రాష్ట్రాన్ని అప్పగిస్తే..
# రూ.8 లక్షల కోట్ల అప్పు ఎందుకు?

- మంత్రి జూపల్లి కృష్ణారావు
- నీళ్లు లేని చోట మాత్రం పదేళ్లలో అనేక ప్రాజెక్టులు కట్టారు
- పాలమూరు ప్రాజెక్టు కాలువలకు ఇంకా అనుమతే రాలేదు
- పాలమూరు ప్రాజెక్టుపై రాజకీయాలు చేస్తోంది మీరా? మేమా?







## పాకిస్థాన్ గూఢచార మాడ్యూల్ గుట్టురట్టు చేసిన ఢిల్లీ పోలీసులు

- 'సీసీటీవీ'లతో సైనికుల కదలికలపై నిఘా పెట్టిన ఉగ్రముఠా
- పాకిస్థాన్ హ్యాండర్లతో ఉగ్రముఠాకు సంబంధాలు
- 11 మంది అరెస్టు– సాంకేతికతను ఉపయోగించి సైనిక కదలికలపై నిఘా

## మహిళలకు, నిరుద్యోగులకు రూ.3000 ఆర్థిక సాయం

- చొరబాట్లపై ఉక్కుపాదం
- బంగాల్ బీజేపీ మేనిఫెస్టో ఇదే!
- సోనార్ బంగ్లా రోడ్ మ్యాప్
- బంగాల్ ఎన్నికల కోసం 15 అంశాలతో బీజేపీ మేనిఫెస్టో విడుదల



# ముంచేస్తోన్న డ్రగ్స్

-మొదటిపేజీ తరువాయి
వివరాలను తెలుసు కుందాం. గంజాయి మత్తు ఇప్పుడు ఒక మహమ్మారిలా వ్యాపిస్తోంది. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా తెలంగాణను కమ్మేస్తోంది. ముఖ్యంగా యువత ఈ డ్రగ్స్ రక్కసి కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. డ్రగ్స్ అంటే ఖరీదుతో కూడుకున్న వ్యవహారం. హెరాయిన్, కొకైన్ వంటి మత్తు పదార్థాలు కొనడం సామాన్యులకు వీలుకాని పని. కానీ, మత్తు మాఫియా తక్కువ ధరకు లభించే గంజాయిని విచ్చలవిడిగా సరఫరా చేస్తోంది. ఒకప్పుడు నగరాలకే పరిమితమైన ఈ మత్తు పదార్థం ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకూ పాకింది. ప్రధానంగా 26 నుంచి 35 ఏళ్ల లోపు ఉన్న యువతే ఎక్కువగా గంజాయి మత్తుకు బానిసలవుతున్నారని ఈగల్ ఫోర్స్ తాజా సర్వేలో వెల్లడైంది.




**అల్ప్రాజోలం తయారీపై ఉక్కుపాదం**
ఈ మత్తు సామ్రాజ్యాన్ని సమూలంగా నిర్మూలించేందుకు 2023లో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాంటీ నార్కోటిక్స్ బ్యూరోనే కొన్ని నెలల కిందట ఈగల్? ఫోర్స్‌గా రూపాంతరం చెందింది. గోవా, ఢిల్లీ, ముంబై, బెంగళూరు లాంటి మెట్రో నగరాల నుంచి వస్తున్న ఖరీదైన మత్తు పదార్థాలపై నిఘా పెడుతూనే, మరోవైపు ఒడిశా నుంచి తెలంగాణ పల్లెల్లోకి చొరబడుతున్న గంజాయి మూలాలపై ఉక్కుపాదం మోపుతోంది. హైదరాబాద్ శివార్లలో అక్రమంగా సాగుతున్న అల్ప్రా జోలం తయారీ కేంద్రాలపై ప్రత్యేక దాడులు నిర్వహిస్తూ, డ్రగ్స్ సప్లయర్స్‌తో పాటు వినియోగదారులను పదుల సంఖ్యలో అరెస్ట్ చేస్తోంది.

**వినియోగిస్తున్న వారే ఎక్కువ**
ఈగల్ ఫోర్స్ పట్టుకున్న నిందితుల వివరాలు, వారి నేపథ్యాలు చూస్తే ఎవరైనా విస్తు పోవాల్సిందే! మూడేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన దాడుల్లో ఏకంగా 21,201 మంది నిందితులు పోలీసులకు చిక్కారు. ఇందులో 639 మంది మహిళలు కూడా ఉండటం గమనార్హం. పట్టుబడిన వారిలో 35.19 శాతం మంది డ్రగ్స్ వినియోగదారులే కావడం గమనించాల్సిన విషయం.

**ఉన్నత చదువులు చదివిన వారూ**
పట్టుబడిన డ్రగ్స్ సప్లయర్స్, వినియోగదారుల్లో తెలంగాణకు చెందిన వారు 16,592 మంది ఉన్నారు. అంతర్రాష్ట్ర నేరస్థులు 4,544 మంది కాగా, అంతర్జాతీయ నేరస్థులు 65 మంది ఉన్నారు. అండర్ గ్రాడ్యుయేట్లు 11,682 మంది, ప్రాథమిక విద్య చదివిన వారు 2,820 మంది, సెకండరీ విద్య చదివిన వారు 2,502 మంది ఉన్నారు. ఉన్నత చదువులు చదివిన గ్రాడ్యుయేట్లు 3,307 మంది, పోస్ట్ గ్రాడ్యుయేట్లు 890 మంది కూడా ఈ డ్రగ్స్ ఊబిలో చిక్కుకున్నట్లు ఈగల్ సర్వే స్పష్టం చేస్తోంది.

**విద్యా బోధనలో భాగం కావాలి**
మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై యువతకు సరైన అవగాహన లేకపోవడంతోనే యువత మత్తుకు బానిసవుతున్నారని నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వాలు కేవలం దాడులకే పరిమితం కాకుండా, ప్రమాదకర మత్తు పదార్థాల గురించి విద్యాభ్యాసంలోనే అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# సైడ్ పార్టీని పట్టుకున్న కవిత వ్యూహం ఏంటి?

**హైదరాబాద్ :** రాజకీయం అంటేనే ఎత్తుగడలు.. మరీ ముఖ్యంగా సొంత గూడు వదిలి బయటకు వచ్చిన నేతలు వేసే అడుగులు చదరంగంలో ఎత్తుల కంటే వేగంగా మారుతుంటాయి. ఈ నెలలోనే ఎజెండాను ప్రకటిస్తానని చెబుతున్న మాజీ ఎంపీ కవిత ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నారు. సహజంగా కొత్త పార్టీ పెడితే అధికార పక్షాన్ని టార్గెట్ చేయడం ఆనవాయితీ.. కానీ, కవిత మాత్రం దీనికి భిన్నంగా వెళ్తున్నారు. అధికార కాంగ్రెస్‌ను కాదని, బలహీనపడ్డ 'కారు' (బీఆర్ఎస్) వెంటే ఆమె ఎందుకు పడుతున్నారు..? ఈ వ్యూహం వెనుక ఉన్న అసలు లెక్కలేంటో చూద్దాం. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి తిరుగు లేదన్న వాదన బలంగా వినిపిస్తోంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక ఐకాన్ లీడర్‌గా ఎదిగారు. ఆయన ఇమేజ్ మరోసారి పార్టీని అధికారంలోకి తెస్తుందన్న విశ్వాసం ప్రజల్లో ఉంది. ఇలాంటి సమయంలో బలంగా ఉన్న రేవంత్ రెడ్డిని కదిపితే అనవసరమైన ఇబ్బందులు తప్ప ప్రయోజనం ఉండదని కవిత భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే రేవంత్ రెడ్డి జోలికి వెళ్లకుండా, తన రాజకీయ భవిష్యత్తు కోసం మరో మార్గాన్ని ఎంచుకున్నారు. అదే కారు పార్టీని కంగారు పెట్టడం. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఎన్నో ప్రాజెక్టులు, పథకాలు ప్రవేశపెట్టినప్పటికీ.. కుటుంబ పాలన, అవినీతి ఆరోపణలు ఆ పార్టీని దెబ్బతీశాయి. గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ ఘోర పరాజయాన్ని మూట గట్టుకుంది. ఇప్పుడు బీఆర్ఎస్‌లో నాయకత్వ లేమి, అంతర్గత కలహాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితం కావడం, కేటీఆర్–హరీష్ రావు మధ్య విభేదాల వాదనలు వినిపిస్తుండడంతో ఆ పార్టీ క్యాడర్ అయోమయంలో ఉంది. ఈ అనిశ్చిత వాతావరణమే తనకు అనుకూలమని కవిత అంచనా వేస్తున్నారు.ఓటు బ్యాంకు బీఆర్ఎస్ పార్టీకి క్షేత్ర స్థాయిలో ఇప్పటికీ బలమైన కేడర్



ఉంది. ఆ కేడర్ ఇప్పుడు నిరుత్సాహంలో ఉండడంతో, వారిని తన వైపు తిప్పుకోవాలన్నది కవిత పక్కా ప్లాన్. బీజేపీకి నాయకులు ఉన్నా క్షేత్ర స్థాయి ఓటు బ్యాంకు తక్కువగా ఉండడంతో, ఆమె దృష్టి అంతా బీఆర్ఎస్ కేడర్‌పైనే ఉంది. 'కారు'లోని అసంతృప్త నేతలను, నాయకత్వం కోసం వెతుకుతున్న కార్యకర్తలను చేరదీయడం ద్వారా తన కొత్త పార్టీని బలోపేతం చేసుకోవాలని వ్యూహాత్మక అడుగులు వేస్తున్నారు. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరన్నది జగమెరిగిన సత్యం. నిన్నటి వరకు అదే పార్టీలో ఉండి, ఇప్పుడు అదే పార్టీ ఓటు బ్యాంకును కొల్లగొట్టాలని చూడడం రాజకీయ చదరంగంలో ఒక భాగమే. కవిత వేస్తున్న ఈ 'రివర్స్ వ్యూహం' ఎంత వరకు ఫలమిస్తుంది..? కేసీఆర్ నిర్మించిన కోటలో ఆమె చీలిక తీసుకురాగలదా? అన్నది ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా ఉత్కంఠను రేకెత్తిస్తోంది. ఈ నెల 25న కవిత ప్రకటించబోయే జెండా, అజెండాలో బీఆర్ఎస్ పార్టీకి సంబంధించి ఎలాంటి అంశాలు ఉంటాయన్నది కీలకం. కాంగ్రెస్‌ను కాదని బీఆర్ఎస్‌ను టార్గెట్ చేయడం ద్వారా ఆమె తెలంగాణ రాజకీయ చిత్రపటాన్ని మార్చాలని చూస్తున్నారు. ఒకవేళ బీఆర్ఎస్ కేడర్ ఆమె వైపు మొగ్గు చూపితే, రాష్ట్రంలో విపక్ష హోదా కోసం సరికొత్త పోరాటం మొదలవుతుంది. ఏదేమైనా కవిత వేస్తున్న ఈ ఎత్తుగడలు గులాబీ శ్రేణుల్లో మాత్రం గుబులు పుట్టిస్తున్నాయి.

# 2028 నాటికి జిల్లాల పునరవ్యవస్థీకరణ

**హైదరాబాద్ :** రాష్ట్రంలో పాలనను ప్రజలకు మరింత చేరువ చేయడమా లేక రాజకీయంగా పట్టు సాధించడమా? కారణం ఏదైనా తెలంగాణలో జిల్లాల సరిహద్దుల మార్పు ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. గత ప్రభుత్వం (బీఆర్ఎస్) చేసిన జిల్లాల విభజనలో లోపాలున్నాయని, శాస్త్రీయత లేదని భావించిన కాంగ్రెస్ సర్కార్, ఇప్పుడు సర్జరీకి సిద్ధమైంది. ఈ మార్పులు కేవలం భౌగోళిక సరిహద్దులకే పరిమితమా? లేక కొత్త జిల్లాల ఏర్పాటుకు దారితీస్తాయా? అన్నది ఆసక్తికరంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన విభజనలో కొన్ని ప్రాంతాలను తమ రాజకీయ ప్రయోజనాల కోసం కలిపారని, దీనివల్ల ప్రజలకు దూరాభారం పెరిగిందని ప్రస్తుత ప్రభుత్వం భావిస్తోంది. రేవంత్ రెడ్డి వ్యూహం ప్రకారం.. కేవలం జిల్లాల సంఖ్యను పెంచడం కాకుండా, భౌగోళికంగా, పరిపాలనా పరంగా ప్రజలకు దగ్గరగా ఉండేలా సరిహద్దులను సవరించడమే ప్రధాన లక్ష్యం. ఇప్పటికే ఐఏఎస్ అధికారుల నుంచి నివేదికలు తెప్పించుకున్న ప్రభుత్వం, ఏ ఏ జిల్లాలను విడగొట్టాలి లేదా ఏ ప్రాంతాలను పక్క జిల్లాల్లో కలపాలి అనే అంశంపై ప్రాథమిక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది.ప్రస్తుతం దేశవ్యాప్తంగా జనగణన ప్రక్రియ ప్రారంభం కావడంతో, నిబంధనల ప్రకారం.. జిల్లాల సరిహద్దులను మార్చడానికి వీలులేదు. ఈ ప్రక్రియ 2028 చివరి నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం తన పదవీకాలం ముగిసేలోగా ఈ భారీ ఆపరేషన్ పూర్తి చేయాలని చూస్తోంది. దీనివల్ల రాబోయే అసెంబ్లీ ఎన్నికల నాటికి కొత్త జిల్లాల సెంటిమెంట్, ప్రజల ఆకాంక్షలను తమకు అనుకూలంగా మార్చుకోవచ్చనేది రాజకీయ వ్యూహం.కేవలం జిల్లాల సరిహద్దుల మార్పు మాత్రమే కాకుండా, భవిష్యత్తులో జరగబోయే అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనను కూడా దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈ అడుగులు వేస్తున్నట్లు సమాచారం. జిల్లా కేంద్రానికి, నియోజకవర్గ కేంద్రానికి మధ్య ఉన్న దూరాన్ని తగ్గించడం ద్వారా అభివృద్ధి ఫలాలు క్షేత్ర స్థాయికి వేగంగా చేరుతాయని ప్రభుత్వం వాదిస్తోంది. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాల సెంటిమెంట్‌ను గౌరవిస్తూనే, పరిపాలనలో వస్తున్న ఇబ్బందులను తొలగించడం ద్వారా ఓటర్లను ఆకట్టుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. జిల్లాల పునర్విభజన అనేది ఎప్పుడూ ఒక డబుల్ ఎడ్జ్ స్వార్డ్ (రెండంచుల కత్తి) లాంటిదే. ఒక ప్రాంతాన్ని జిల్లాగా ప్రకటించినప్పుడు వచ్చే




మైలేజీ కంటే, కీలకమైన ప్రాంతాలను పక్క జిల్లాల్లో కలిపినప్పుడు వచ్చే వ్యతిరేకత ఎక్కువగా ఉంటుంది. అందుకే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈసారి అనాలోచితంగా కాకుండా, ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టి, అఖిలపక్ష సమావేశాల ద్వారా ఏకాభిప్రాయం సాధించాలని చూస్తోంది. ఏది ఏమైనా, 2028 నాటికి తెలంగాణ రాజకీయ చిత్రపటం మరోసారి మారడం ఖాయంగా కనిపిస్తోంది.

## ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త

-మొదటిపేజీ తరువాయి
ఉద్యోగులకు 50.7 శాతం డీఏ ఉండగా, తాజా పెంపుతో అది 52.8 శాతానికి పెరిగింది. దీంతో పెరిగిన డీఏ ద్వారా ఆర్టీసీ సంస్థపై ప్రతి నెలా రూ.2.82 కోట్ల అదనపు భారం పడనుంది. జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు పెరిగిన డీఏను వరుసగా మూడు నెలలకు ఒక్కో నెలలో సప్లిమెంటరీ బిల్స్ ద్వారా ప్రభుత్వం ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయనుంది. గత సంవత్సరం (2025) జులైలో డీఏను 2.1 శాతం పెంచిన సంగతి తెలిసిందే. అప్పుడు 48.6 శాతం నుంచి 50.7 శాతానికి పెంచారు.

**అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి**
డీఏ పెంపు సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులకు మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేసి అభివృద్ధి కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలని సూచించారు. "తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మికులకు సంబంధించి పెండింగ్ ఉన్న ఏకైక డీఏను కూడా ఇవ్వడానికి నిర్ణయం తీసుకున్నాం. జనవరి 2026 నుంచి 2.1 శాతం డీఏను పెంచుతున్నాం. మొదటి నుంచి సంస్థ మూడు ప్రధాన అంశాలపై పని చేస్తుంది. కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం, సంస్థ పరిరక్షణ–అభివృద్ధి. ప్రధానంగా సంస్థలో భాగస్వాములైన కార్మికుల సంక్షేమంపై వారికి సంబంధించిన ఆరోగ్య సంరక్షణకు ఆసుపత్రి అప్‌గ్రేడేషన్, కారుణ్య నియామకాలు, దీర్ఘ కాలంగా రిమూవ్ అయిన వారిని త్రిమెన్ కమిటీ ద్వారా తిరిగి విధుల్లోకి తీసుకోవడం, కొత్త నియామకాలు చేపట్టి ఉన్న కార్మికులపై పని భారం తగ్గించడం, కొత్త బస్సులు కొనుగోలు లాంటి అనేక కార్యక్రమాలు చేస్తున్నాం. లైఫ్? లైన్ అయినటువంటి ఆర్టీసీని మరింత ముందుకు తీసుకువెళ్తున్నాం"

**ఉద్యోగులకు రూ. కోటి ప్రమాద బీమా**
తమ ఉద్యోగులకు రూ.కోటి ప్రమాద బీమా పథకాన్ని అమలు ఆర్టీసీ చేస్తోంది. ఉద్యోగుల సామాజిక భద్రతను మరింత మెరుగు పరిచేందుకు సహజ మరణానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా రూ.10 లక్షల బీమా కల్పించనున్నట్లు ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తెలిపారు. ఈ నిర్ణయం ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలతుందని తెలిపారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ)లో సాలరీ అకౌంట్ ఉన్న ఉద్యోగులకు ఈ బీమా వర్తిస్తుంది. ఈ నిర్ణయంతో సంస్థలో పనిచేస్తున్న దాదాపు 38 వేలకు పైగా ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించిందని ఎండీ తెలిపారు.

**ఏ క్షణంలోనైనా సమ్మె**
ఈనెల 23 తర్వాత ఏ క్షణంలోనైనా సమ్మెకు వెళ్లే అవకాశం ఉందని ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ వెంకన్న, వైస్ ఛైర్మన్? థామస్ రెడ్డిలు గురువారం తెలిపారు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్?లోని కార్మిక శాఖ కార్యాలయంలో లేబర్ డిపార్ట్?మెంట్ అధికారులతో ఆర్టీసీ జేఏసీ నేతలు సమావేశం అయ్యి పలు సమస్యలపై చర్చించారు. దీనికి ఆర్టీసీ అధికారులు హాజరు కాకపోవడంతో పూర్తిస్థాయిలో చర్చ జరగలేదని జేఏసీ నేతలు చెప్పారు.
ఈనెల 13వ తేదీన మరోసారి లేబర్ కమిషనర్, ఆర్టీసీ యాజమాన్యంతో చర్చలు ఉంటాయని ఆ తర్వాత సమ్మెపై పూర్తిస్థాయిలో స్పష్టత వస్తుందని ఐక్య కార్యాచరణ సమితి నేతలు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, యాజమాన్యం కలిసి కార్మికుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు.


## అన్నా నన్ను దేవుడే పంపిండు మీతో కలిసి పని చేయమని..

-మొదటిపేజీ తరువాయి
ఉన్నారు. ఈ సందర్భంగా ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసానికి తొలిసారి వచ్చిన జీవన్ రెడ్డిని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యే డా. కె.సంజయ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కె. విద్యాసాగర్ రావు, పార్టీ నేతలు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. తెలంగాణకు నష్టం జరుగుతున్న సమయంలో మీతో కలిసి పనిచేయాల్సిన అవసరమున్నదని, మీతో కలిసి పనిచేయమని దేవుడే నన్ను మీదగ్గరికి పంపించిండు. చాలా గ్యాప్ తర్వాత ఇన్నాళ్ల కైనా మీతో కలిసిపనిచేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది' అంటూ మనసులోని మాటను వ్యక్తం చేశారు. ఈ సంధ్భంగా జీవన్‌రెడ్డిని కేసీఆర్ సన్మానించారు.

## ధనిక రాష్ట్రాన్ని అప్పగిస్తే.. రూ.8 లక్షల కోట్ల అప్పు ఎందుకు?

**హైదరాబాద్:** గత ప్రభుత్వ నాయకులకు సరైన ఆలోచన, అవగాహన లేక రాష్ట్రానికి తీవ్ర నష్టం చేశారని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. నీళ్లు లేని చోట మాత్రం పదేళ్లలో అనేక ప్రాజెక్టులు కట్టారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీకి ధనిక రాష్ట్రం అప్పగిస్తే, రూ.8 లక్షల కోట్లు ఎందుకు అప్పు చేశారని విమర్శించారు. పాలమూరు ప్రాజెక్టు కాలువలకు ఇంకా అనుమతే రాలేదన్న జూపల్లి.. పాలమూరు ప్రాజెక్టుపై రాజకీయాలు చేస్తోంది మీరా? మేమా? అని నిలదీశారు. పాలమూరు ప్రాజెక్టును 80శాతం పూర్తి చేశామని అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు.

## పొంచి ఉన్న తాగు నీటి సంక్షోభం



**హైదరాబాద్ :** తెలంగాణలోని నీటి జలాశయాలు దాదాపు ఎండిపోయే పరిస్థితికి చేరుకున్నాయి. దీంతో హైదరాబాద్ కు నీటిఎద్దడి సమస్య తలెత్తుతుందన్న అలెర్ట్ ఇప్పటికే అందింది. వేసవి కాలంలో నీటి ఎద్దడి మామూలే. గతలో ఎన్నడూ లేని విధంగా ఎండల తీవ్రత ఈ ఏడాది మార్చి నెల నుంచి ఉండటంతో నీటి సరఫరా జలమండలికి కష్టంగా మారింది. మార్చి మొదటి వారం నుంచే ట్యాంకర్లను బుక్ చేసుకుంటున్నారంటే పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుందని చెప్పాలి. మరొకవైపు గతంలో రోజుకు గంట నుంచి రెండు గంటల పాటు వచ్చే నల్లా నీరు ఇప్పుడు అరగంట వచ్చిన తర్వాత సన్నటి ధార వస్తుండటం మంచినీటి ఎద్దడికి ఉదాహరణగా చూడాలి.సాగునీటి సంగతి పక్కన పెడితే తాగు నీటికి కూడా ఈ ఏడాది ఇబ్బందులు తప్పవని హెచ్చరిస్తున్నారు. అందుకే నీటివృధాను అరికట్టాలని జలమండలి అధికారులు ఎప్పటికప్పుడు నగర ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. గతంలో మే నెలలో కొంత నీటి ఎద్దడి ఉండేది. ఈసారి మార్చి నెల నుంచే ప్రారంభమయింది. నీరు వృధా చేసినా, తాగు నీటితో వాహనాలు శుభ్రంచేసినా జరిమానా విధిస్తామని జలమండలి అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు కూడా జలమండలి అధికారులతో సహకరించాల్సి ఉంది. మరొకవైపు భూగర్భ జలాలు ఎండిపోవడంతో నగరంలో అనేకచోట్ల బోర్లు ఎండిపోయాయి. చుక్క నీరు కూడా బోరు నుంచి రాకపోవడంతో ట్యాంకర్లకు వేల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.నాగార్జునసాగర్ ప్రాజెక్టులో కేవలం 176.06 టీఎంసీలుమాత్రమే ఉన్నాయి. శ్రీశైలం ప్రాజెక్టులో 43.75 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. దాదాపు డెడ్ స్టోరేజీకి ప్రాజెక్టులు చేరుకున్నాయి. శ్రీరాం సాగర్ ప్రాజెక్టులో 28.83 టీఎంసీలు, నిజాం సాగర్ లో 9 టీఎంసీలు, జూరాలలో 9.66 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. కృష్ణా, గోదావరి నదుల్లో కూడా నీరు లేకపోవడంతో ఇక రానున్నకాలంలో హైదరాబాద్ కు తీవ్రమైన నీటి సంక్షోభం పొంచి ఉందన్న హెచ్చరికలు వినపడుతున్నాయి. ఎగువ రాష్ట్రాల్లో వానలు పడితేనే ఏమైనా నీరు వచ్చి జలాశయాలకు చేరుతుంది. కానీ ఇప్పుడు ఆసమస్య లేదు. మరొకవైపు వచ్చే ఏడాది వర్షపాతం తక్కువగా నమోదవుతాయని భారత వాతావరణ శాఖ చేసిన హెచ్చరికలు కూడా పరిస్థితి తీవ్రతకు మరింత అద్దంపడుతుంది. మొత్తం మీద చుక్కనీటిని వృధా చేయకుండా ప్రజలు కూడా అధికారులకు సహకరించాలని కోరుతున్నారు.

# ఘనంగా కుంకుమ పూజలు

**జగిత్యాల, ఏప్రిల్10, అక్షర రేఖ** న్యూస్ మానేరు సురేష్ జగిత్యాల పట్టణ చింతకుంట సమీపం లోని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయం లో శ్రీ ధనలక్ష్మి సేవా సమితి వారి అధ్వర్యంలో 2026 ఏప్రిల్ 10 చైత్రమాసం శుక్ల పక్షం శుక్రవారం కాల భైరవ అష్టమి పర్వదినం పురస్కరించుకొని పట్టణంలోని ప్రజలు మాతలు భక్తులు అమ్మవారి సేవలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన లలితా సహస్ర నామాల స్తోత్ర పారాయణం చేసారు.పారాయణం అనంతరం మాతలు తీసుకువచ్చిన ఒడి బియ్యాన్ని అమ్మ వారికి సమర్పించారు కుంకుమ పూజ అనంతరం లక్కీ డిప్ ద్వార ఒక్కరిని ఎంపిక చేసి వారికి అమ్మ వారి శేష వస్త్రం మరియు అమ్మ వారి ప్రసాదం తాంబూలం ఆలయ పూజారి శ్రీహరి చేతులమీదుగా ఆశీర్వచనములతో బహుకరించారు తదుపరి కోరిన కోరికలు తీర్చుటకై అమ్మ వారికి ముడుపులు కట్టారు





ఈ కార్యక్రమము లో దేవాలయ ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ వడ్లగట్ల రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ వోడ్నాల శ్రీనివాస్, మహిళా సభ్యులు వొడ్నాల లత,గాల్లిపెల్లి సుజాత, మాధురి, రజిత, ప్రసన్న, హర్షిణి, గంగవ్వ. అర్చకులు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం

# కలెక్టరేట్ లో రక్తదాన శిబిరం

ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగం గా అధికారుల రక్త దానం

జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ జిల్లా /అక్షర రేఖ) ఏప్రిల్10: జిల్లా ప్రతినిధి** రసమల్ల మల్లేష్ / ప్రభుత్వ ఉద్యోగులు కూడా సామజిక కార్యక్రమాలలో పాలు పంచుకోవాలన్న ఉద్దేశ్యం తో... ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగం గా కలెక్టరేట్ లో రక్త దాన శిబిరాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు జిల్లా ఆరోగ్య, వైద్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రక్త దాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు ఈ శిబిరాన్ని..డి ఏం ఎచ్ ఓ మల్లి ఖార్జున్ రావు, డి సి ఎచ్ ఎస్ నరేందర్ శర్మ , మెడికల్ అధికారులు అన్వర్, దివ్య లతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ ఝా ప్రారంభించారు

ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ....రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమన్నారు ఇది ఎంతో నిస్వార్థమైన, గొప్ప మానవీయ సేవ అని...దీని వల్ల.... ఆరోగ్యవంతులైన వ్యక్తులు చేసే రక్తదానం, ప్రమాదాల్లో, శస్త్రచికిత్సల్లో, తీవ్రమైన వ్యాధులతో ఇబ్బంది పడుతున్న వారి ప్రాణాలను నిలబెడుతుందన్నారు . రక్తదానం చేయడం వల్ల గుండెపోటు ప్రమాదం తగ్గుతుందని...శరీరంలో ఐరన్ స్థాయిలు అదుపులో ఉంటాయన్నారు ఈ రక్త దాన శిబిరం లో వివిధ శాఖల అధికారులు, వారి సిబ్బంది మొత్తం 62 మంది తమ రక్తాన్ని దానం చేసారు




ఈశిబిరాన్ని...మెడికల్ అధికారులు, వారి టెక్నీషియన్స్ సజావుగా నిర్వహించి రక్తం దానం చేసిన వారికి పండ్లు, జ్యూస్ లను అందించారు

# ఆరోగ్యమే లక్ష్యంగా యోగాతో ముందడుగు

# 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో





జనగామ జిల్లా /అక్షర రేఖ) ఏప్రిల్10: జిల్లా ప్రతినిధి రసమల్ల మల్లేష్/ జనగామ జిల్లా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య వారోత్సవాల కింద అయిదో రోజు హోమియోపతి, ఆయుష్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం యోగా ప్రదర్శన కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా శిక్షకులు అందరితో యోగా సాధన చేయించారు. యోగా శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, ప్రతి ఒక్కరూ తమ రోజువారీ జీవితంలో యోగా సాధనను అలవాటు చేసుకోవాలని సూచించారు. ఆయుష్ విధానాలు ఆరోగ్యకరమైన జీవన విధానానికి దోహదపడతాయని చెప్పారు. ప్రజల్లో ఆరోగ్యం పట్ల అవగాహన పెంపొందించడానికి ఈ తరహా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని డీఎంహెచ్ఓ తెలిపారు. యోగా ద్వారా శారీరక వ్యాయామం మాత్రమే కాకుండా మానసిక ప్రశాంతత కూడా పొందవచ్చన్నారు. యోగా సాధనలో ఆసనాలు (శరీర భంగిమలు), ప్రాణాయామం (శ్వాస వ్యాయామాలు), ధ్యానం (మెడిటేషన్) వంటి అంశాలు ఉంటాయని, నిత్యం యోగా చేయడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, ఒత్తిడి తగ్గుతుందని, నిద్ర మెరుగుపడుతుందని, అలాగే మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులను నియంత్రించడంలో కూడా యోగా ఉపయోగపడుతుందని జీజీహెచ్ సూపరింటెండెంట్ వివరించారు. ప్రతి ఒక్కరూ రోజూ కొంత సమయం కేటాయించి యోగా సాధన చేయడం ద్వారా




ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరచుకోవాలని స్పష్టం చేశారు. ఈ యోగా కార్యక్రమంలో డీఎంహెచ్ఓ మల్లికార్జున రావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ రాజలింగం, విద్యా శాఖ ఏడీ సత్యనారాయణ మూర్తి, ఆయుష్ వైద్యాధికారులు, ఇతర సంబంధిత వైద్యాధికారులు, ఆరోగ్య శాఖ సిబ్బంది, పెద్ద సంఖ్యలో ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ కడియం కావ్యకు జన్మదిన శుభాకాంక్షలు

కాంగ్రెస్ నాయకులు ఎలమకంటి నాగరాజు, జీడికంటి నవీన్



**రఘునాథపల్లి, అక్షర రేఖ ) ఏప్రిల్10:** వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య జన్మదిన సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకులు ఎలమకంటి నాగరాజు, జీడికంటి నవీన్‌లు శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం హన్మకొండలోని ఎంపీ నివాసంలో ఆమెను కలుసుకున్న నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు.

## బదిలీపై వెళ్తున్న కార్యదర్శికి సర్పంచ్ సన్మానం.



**రఘునాథపల్లి /అక్షర రేఖ) ఏప్రిల్10:** మండల లోని కుసుంబాయి తండా గ్రామపంచాయతీలో ఇన్‌చార్జి కార్యదర్శిగా సేవలందిస్తూ బదిలీపై వెళ్లుతున్న సందర్భంగా, గ్రామ సర్పంచ్ కొర్ర స్వరూప రాజేందర్ నాయక్ మరియు గ్రామ ప్రజలు కలిసి కార్యదర్శి కవిత ని శాలువాతో ఘనంగా సన్మానించి, వారి సేవలను కొనియాడార

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగాల్లో బదిలీలు సాధారణమే అయినప్పటికీ, గ్రామంలో ప్రజలతో మమేకమై వారి విశ్వాసాన్ని పొందడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. కవిత కుసుంబాయి తండా గ్రామానికి అందించిన సేవలు అభినందనీయమని తెలిపారు. భవిష్యత్తులో ఎక్కడ పనిచేసినా అదే విధంగా ప్రజలకు సేవ చేస్తూ మంచి గుర్తింపు సంపాదించాలని ఆకాంక్షించారు. అనంతరం కార్యదర్శి కవిత స్పందిస్తూ, తన విధుల నిర్వహణలో ఎల్లప్పుడూ సహకరించిన సర్పంచ్ కి మరియు గ్రామ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తాను పనిచేసిన కాలంలో అందించిన సహకారం మరువలేనిదని పేర్కొంటూ, తనకు శాలువాతో సన్మానం చేసినందుకు సర్పంచ్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఇన్‌చార్జి కార్యదర్శి సంపత్, గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.బి

## గోవిందారం విద్యార్థి సాఫ్ట్ బాల్ లో జాతీయస్థాయిలో ఎంపిక



అభినందించిన జిల్లా విద్యాధికారి రాము

**జగిత్యాల, ఏప్రిల్10, అక్షర రేఖ న్యూస్** మానేరు సురేష్ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలలో జగిత్యాల జిల్లా గోవిందారం గ్రామంనకు చెందిన విగ్నేష్ .ఈ విద్యార్థి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి చదువుతున్నాడు ఈ సంవత్సరం గత నెల మార్చి లో మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు లో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలలో విదార్థి సిహెచ్ విగ్నేష్ పాల్గొని ప్రతిభను కనబరిచి ఈనెల 16 నుండి దేశ రాజధాని ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు, ఈ సందర్భంగా విద్యార్థి విగ్నేష్ ను జిల్లా విద్యాధికారి రాము అభినందించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండి అశ్వక్ ఫిజికల్ డైరెక్టర్ ఎం ప్రశాంత్ పి ఆర్ టి యు టి ఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోయిని పెల్లి ఆనంద్ రావు యాల్ల అమర్నాథ్ రెడ్డి పి ఆర్ టి యు టి ఎస్ రాష్ట్ర కార్యదర్శి మిట్ట పెల్లి రాజేందర్ రావు పాల్గొన్నారు

## ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి నిర్వహణ కోసం ఆల్ పార్టీ తో సమావేశమైన మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) గారు..



**జమ్మికుంట ఏప్రిల్ 10(అక్షర రేఖ)** జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ గారి జయంతి ఏప్రిల్ 14 పురస్కరించుకొని పట్టణ ఆల్ పార్టీ తో సమావేశమైన మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ గారు మాట్లాడుతూ డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి ఏర్పాట్లకు పట్టణ పరిధిలోని ఆల్ పార్టీ,అన్ని రాజకీయ పార్టీల నాయకులు, అంబేద్కర్ యువజన సంఘాల యొక్క సూచనలు సలహాలు స్వీకరించడం జరిగింది తదనుగుణంగా ఏర్పాట్లు చేస్తామని మా పాలకవర్గం రాజకీయపార్టీలకు కులమతాలకు అతీతంగా అనునిత్యం జమ్మికుంట పట్టణ ప్రజలకోసం పనిచేస్తుందని తెలిపారు ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్ గారు గౌరవ కౌన్సిలర్స్ మరియు పట్టణ అన్ని రాజకీయ పార్టీల నాయకులు యువకులు తదితరులు పాల్గొన్నారు...

# లబ్ధిదారులకు సీఎంఆర్ చెక్కుల అందజేత

**ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

**రఘునాథపల్లి/ అక్షర రేఖ)** ఏప్రిల్10 తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని. రాష్ట్రం కాంగ్రెస్తోనే అభివృద్ధి సాధ్యమని స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు.శుక్రవారం రఘునాథపల్లి మండలం కేంద్రంలో సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం కంచనపల్లి గ్రామంలో 25 లక్షల సిసి రోడ్డు పనులకు ప్రారంభం..
మక్కలు కొనుగోలు కేంద్రం ప్రారంభం..ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం తో పాటు తెలంగాణ రాష్ట్రం లోని అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఆయన అన్నారు.రాష్ట్రంలోనే స్టేషన్గన్పూర్ అభివృద్ధి లక్ష్యంగా ముందుకెళ్తున్నానని ఆయన వివరించారు.. అభివృద్ధి లక్ష్యంగా ముందుకెళుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం విమర్శిస్తున్న ప్రతిపక్షాలకు పుట్టగతులు ఉండవని ఆయన విమర్శించారు.మండే ఎండల్లో సైతం 76 సంవత్సరాల ఎమ్మెల్యే కడియం శ్రీహరి పర్యటన చేయడం జరిగింది ఆయన కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మారుజోడు రాంబాబు.. మాజీ జెడ్పిటిసి లింగాల జగదీష్ చంద్ర రెడ్డి.. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోల రవి గౌడ్ జిల్లా నాయకులు క్రాంతి కుమార్.. మేకల నరేందర్.. లింగాజీ.. లోనే శ్రవణ్ కుమార్. గాదె మహేందర్ రెడ్డి.. మార్కెట్ డైరెక్టర్లు మహమ్మద్ భాషనీయ.. బంధ కుమార్... పరశురాములు.. స్థానిక సర్పంచ్.. చైర్మన్ జయరాములు..
రాపోలు రామ్మూర్తి... కె మల్లేష్.. తోటకూర రమేష్ యాదవ్... గొల్లూరి పృథ్వి.. మాజీ ఎంపీటీసీ సభ్యులు ప్రభుదాస్... పాస్టర్ లు
వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావుపై అక్రమంగా పెట్టిన ఉపా చట్టం కేసును ఎత్తివేయాలి

సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ డిమాండ్


**అశ్వారావుపేట, ఏప్రిల్ 10(అక్షర రేఖ)** సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ పోటు రంగారావుపై జాతీయ దర్యాప్తు సంస్థ (చీ×ూూ) కుట్రపూరితంగా 'ఉపా' (ఖ×ూూ) కేసు నమోదు చేయడాన్ని పార్టీ అశ్వారావుపేట మండల కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు శుక్రవారం అశ్వారావుపేటలో పార్టీ డివిజన్ కార్యదర్శి గోకినపల్లి ప్రభాకర్, పార్టీ మండల కార్యదర్శి వాసం బుచ్చిరాజులు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ప్రజా గొంతుకను నొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తన నిరంకుశత్వంతో ప్రజాస్వామ్యవాదుల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. గత 50 ఏళ్లుగా కామ్రేడ్ పోటు రంగారావు భూమి, భుక్తి, విముక్తి లక్ష్యంగా రాజ్యాంగబద్ధంగా, బహిరంగంగా ప్రజా ఉద్యమాలను నడుపుతున్నారని గుర్తు చేశారు. ప్రజల పక్షాన నిలబడి వారి హక్కుల కోసం పోరాడుతున్న నాయకుడిపై అక్రమ కేసులు బనాయించడం అప్రజాస్వామికం. రాజ్యాంగ పరిధిలో ఉంటూ ప్రభుత్వాల ఉల్లంఘనలను ప్రశ్నించడం నేరం ఎలా అవుతుంది?" అని నేతలు నిలదీశారు. 22న విచారణకు హాజరుకావాలని నోటీసులు 'ఉపా' చట్టం కింద కేసు నమోదు చేసిన చీ×ూూ, ఈ నెల 22వ తేదీన దర్యాప్తునకు హాజరు కావాలని నోటీసులు జారీ చేయడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీ అనుసరిస్తున్న మతోన్మాదం ఫాసిజం విధానాలను వ్యతిరేకిస్తూ పార్టీ పోరాటాల నిర్మిస్తుందని ప్రశ్నించే గొంతులను అర్బన్ నక్సలైట్ పేరుతో ఉక్కు పాదం మోపటం సరైన పద్ధతి కాదని తక్షణమే ఈ అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థల ద్వారా చేస్తున్న ఈ అప్రజాస్వామిక చర్యకు వ్యతిరేకంగా ప్రజలు, మేధావులు మరియు ప్రజాస్వామికవాదులు గొంతు ఎత్తాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు.





# రాష్ట్ర వ్యాప్తంగా రైతులు పండించిన ప్రతి గింజ కొనుగోలు...





**రైతు భరోసా క్రింద ప్రతి ఎకరానికి పన్నెండు వేలు ఇస్తున్నాంలి**

**రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 3 లక్షల 80 వేల మంది రైతులకు కొత్త పాస్ పుస్తకాలు ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశ కార్యక్రమంలో, ప్యాక్స్ గోడౌన్ ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి పొంగులేటి, జిల్లా కలెక్టర్**

**ఖమ్మం జిల్లా బ్యూరో అక్షర రేఖ న్యూస్** కూసుమంచి, ఏప్రిల్ 10 రాష్ట్ర వ్యాప్తంగా రైతులు పండించిన ప్రతి గింజ కొనుగోలు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం కూసుమంచి మండలంలో పర్యటించి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్ లతో కలిసి పర్యటించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా వెంకటాపురం గ్రామంలో దేపంగి శ్రీకాంత్, వీరకుమారి దంపతులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం చేగొమ్మ గ్రామంలో ఒక కోటి 52 లక్షలతో నిర్మించిన 2 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం గోడౌన్ లను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో గడిచిన రెండు సంవత్సరాల మూడు నెలల్లో అన్ని వర్గాల వారికి, రైతులకు ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం రైతులను రాజు చేసే కార్యక్రమంలో భాగంగా రైతుల సంక్షేమంతో పాటు వారి అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల్లోనే అన్న మాట ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 25 లక్షల మంది రైతులకు 20 వేల 670 కోట్లు రెండు లక్షల రూపాయల వరకు రుణ మాఫీ చేశామని మంత్రి తెలిపారు. రైతు భరోసా ద్వారా ప్రతి పంటకు ఎకరానికి 6 వేల రూపాయలు చొప్పున సంవత్సరానికి 12 వేలు ఇస్తున్నామని, సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాకు అదనంగా 500 రూపాయలు బోనస్ అందిస్తున్నామని, సన్న వడ్లను ఇతర ప్రాంతాలకు పంపకుండా
పట్టించి పేదలకు సన్న బియ్యం అందిస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా రైతులు పండించిన ప్రతి గింజను కొన్నామని, ఇకముందు కూడా కొంటామని, కొన్న వారం రోజుల్లోగా రైతుల ఖాతాల్లో ప్రజా ప్రభుత్వం డబ్బులు జమ చేస్తున్నదని తెలిపారు. రైతులు పండించిన పంట నిల్వ ఉంచాలంటే వాటికి గోదాముల అవసరమున్నదని, సొసైటీ ద్వారా వెయ్యి మెట్రిక్ టన్నుల కెపాసిటీతో రెండు గోదాములు చేగొమ్మలో నిర్మించుకొని నేడు ప్రారంభించుకున్నామని తెలిపారు. రైతులకు భరోసాగా భూ భారతి తీసుకొచ్చి రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 3 లక్షల 80 వేల మందికి కొత్త పాసు పుస్తకాలను అందజేశామని, ప్రతి అంగుళాన్ని సర్వే చేసి రైతుల పాసు పుస్తకంలో భూమి సర్వే మ్యాప్ ను ప్రింట్ చేసి భవిష్యత్ లో భూమి పంచాయతీలు రాకుండా ఉండే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండవ విడత ఇందిరమ్మ ఇళ్లను రాబోయే కొద్ది రోజుల్లోనే ఇస్తామని, మూడు, నాలుగో విడతలలో కూడా అర్హులైన పేదవాళ్లకు ఇందిరమ్మ ఇళ్లులు ఇస్తామని తెలిపారు. ప్రతి సోమవారం కట్టిన ఇంటి లెవెల్ కు అనుగుణంగా డబ్బులు జమ చేస్తున్నామన్నారు. రైతులు, ఆడబిడ్డలు ఆత్మ గౌరవంతో బతికేలా, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడంతో పాటు, ప్రతి వర్గాన్ని ప్రభుత్వం ఆదుకుంటూ, భవిష్యత్తులో మరింత అండగా ఉంటుందని తెలిపారు. చేగొమ్మ గ్రామస్తులు కోరిన విధంగా కొండాపురం రోడ్డును రాబోయే వర్షాకాలం లోపు పూర్తి చేయిస్తానని తెలిపారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ప్యాక్స్ ఆధ్వర్యంలో నిర్మించుకున్న రెండు గోదాములు నేడు మంత్రివర్యుల చేతుల మీదుగా ప్రారంభించుకున్నందుకు సంతోషం వ్యక్తం చేసారు. 2 గోదాములు ప్రారంభించుకోవడంతో రెండు వేల మెట్రిక్ టన్నుల స్టోరేజ్ కెపాసిటీ జిల్లాలో పెరిగి, జిల్లాలో పండించిన పంటకు స్టోరేజ్ వెసలుబాటు వచ్చిందని, వేరే జిల్లాలపై ఆధారపడకుండా సీజన్ కు ముందు గోదాములు అందుబాటులోకి తీసుకొని వచ్చామని అన్నారు. పంట కోతల ఆధారంగా ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేసి, ధాన్యం కొనుగోళ్లు చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసే విధంగా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, డిసిఓ గంగాధర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, కూసుమంచి మండల తహసీల్దార్ సైదులు, ఎంపీడీఓ, వివిధ గ్రామాల సర్పంచ్, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు

# వీర కుమారి దంపతుల ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం

**కూచుమంచి మండలం నేలపట్ల గ్రామ పరిధిలోని వెంకటరాపురం దీపాంగి శ్రీకాంత్, వీర కుమారి దంపతుల ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం**

**మంత్రి పాంగిలేటి శ్రీనివాస్ రెడ్డి**

**ఖమ్మం జిల్లా బ్యూరో అక్షర రేఖ న్యూస్ ఏప్రిల్ 10**

ఈ సందర్భంగా నేలపట్ల గ్రామపంచాయతీ సర్పంచ్ నూకల శోభన్ బాబు మరియు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మంత్రి వెంట ఉండి ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేయటం జరిగింది పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల చివరిలో పదివేల ఇల్లు గృహప్రవేశం చేయాలని ఈ సందర్భంగా ప్రస్తావించారు. లబ్ధిదారులను ఉద్దేశించి నేలపట్ల గ్రామ సర్పంచి నూకల శోభన్ బాబు ఇల్లు తొందరగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. లబ్ధిదారులు సకాలంలో ఇల్లు నిర్మించి తొందరగా గృహప్రవేశం చేయాలని కోరారు. ఇల్లు పిల్లలు తొందరగా వచ్చేలా ప్రయత్నం చేస్తానని చెప్పారు నూకల శోభన్ బాబు గ్రామ సర్పంచి నేలపట్ల.




## ఫలించిన కాంగ్రెస్ నాయకుల కృషి
## రెండు దశాబ్దాల కల నెరవేర్చనున్న శ్రీనన్న



**ఖమ్మం జిల్లా బ్యూరో అక్షర రేఖ న్యూస్ ఏప్రిల్ 10** గత రెండు దశాబ్దాలు గా ఆటో నగర్ నుండి మద్దులపల్లి మార్కెట్ వరకు నిత్యం రద్దీగా వుండే రోడ్ కనీస మరమ్మత్తులు అనేవి కూడా నోచుకోకుండా గ్రామపంచాయతీగ ఉన్నప్పుడు కనీసం పట్టించుకునే వారు లేక ఈ రోడ్ నుండి రాకపోకలు సాగించు ప్రజల కష్టాలు పట్టించుకునే వారు లేక ఇబ్బందులకి గురవుతున్నారు. ప్రజా ప్రభుత్వం ఎన్నో అడ్డంకులు దాటుకొని ఆటోనగర్ నుండి మద్దులపల్లి మార్కెట్ వరకు రోడ్ నిర్మాణానికి రేపు శంకుస్థాపన చేయబోతుంది. కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన మాట కొరకు పోరాడి అడ్డంకులు దాటుకొని 30 వ వార్డు ప్రజల కల నెరవేర్చటానికి చేసిన కష్టానికి ఫలితం రేపు మన గౌరవ తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ మరియు సమాచార శాఖ మాత్యులు శ్రీ లిపొంగులేటి శ్రీనివాస రెడ్డి చేతుల మీదగా శంకుస్థాపనే .ప్రజల కొరకు పోరాడేది మన కాంగ్రెస్ పార్టీ, ప్రజల పక్షాన నిలబడేది మన శ్రీనన్న.మా కష్టాన్ని గుర్తించి మా సమస్య కి శాశ్వత పరిస్కారం చూపిన మా అన్న పొంగులేటి శ్రీనివాస రెడ్డి కి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇవే మా ప్రత్యేక ధన్యవాదముల.ప్రజల తరుపున ప్రభుత్వానికి మన పొంగులేటి శ్రీనివాస రెడ్డికి సమస్యను విన్నవించి రోడ్ మంజూరుకు పాటు పడిన భూక్యా సురేష్ నాయక్, గనపారపు వీరయ్య, కొట్టం శిరీష రంజిత్ రెడ్డి కి ఇవే మా ప్రత్యేక ధన్యవాదములు.

## చలివేంద్రం ను ప్రారంభించిన ఎమ్మెల్యే

**జగిత్యాల, ఏప్రిల్10, అక్షర రేఖ న్యూస్** మానేరు సురేష్



జగిత్యాల పట్టణం లోని జనగణమన మిత్ర బృందం వారి ఆధ్వర్యంలో స్వర్గీయ ఉటూరి గంగారాం సరోజన వారి జ్ఞాపకార్థం జగిత్యాల పాత బస్టాండ్లోమండు తున్న ఎండల దృష్ట్యా ప్రజల దాహార్తి తీర్చుట కొరకు




ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన పురిఫైడ్ డ్రింకింగ్ వాటర్ ఫిల్టర్ ను జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మున్సిపల్ చైర్ పర్సన్ సముండ్ల వాణి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డీఎం కల్పన, నిత్య జనగణమన నిర్వాహకులు గంగాధర్, కౌన్సిలర్లు పిట్ట ధర్మరాజు, కూతురు రాజేష్, క్యాదాసు నవీన్, నాయకులు బండారి రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## గిడ్డంగుల సంస్థ గోడౌన్ లను పరీశీలించిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు..




**ఖమ్మం జిల్లా బ్యూరో అక్షర రేఖ న్యూస్ ఏప్రిల్ 10**. ఖమ్మం జిల్లా,మంచుకోండ లోని గిడ్డంగుల సంస్థ గోడౌన్ లను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పరీశీలించారు..గోడౌన్ లో నిల్వ ఉన్న సన్న బియ్యాన్ని పరీశీలించి వాటి నాణ్యతను పరీశీలించారు.. నిల్వలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.. కెమికల్స్ ఉపయోగించే విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు..బియ్యంలో పురుగులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు..బియ్యం నిల్వల్లో జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు..ఈ కార్యక్రమంలో డిసిసి మాజీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు..

## రేపు మంత్రి పొంగులేటి తిరుమలయపాలెం మండలం పర్యటన విజయవంతం చేయండి

**ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ**

**ఖమ్మం జిల్లా బ్యూరో అక్షర రేఖ న్యూస్ ఏప్రిల్ 10**



తిరుమలాయపాలెం మండలంలో శనివారం తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించనున్నారు ముందుగా మండలంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో తిరుమలాయపాలెం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు. చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేయనున్నారు అనంతరం హదర్ సాయి పేట గ్రామంలో బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు కావున ఈ యొక్క కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులను కార్యకర్తలను పొంగులేటి అభిమానులను అధిక సంఖ్యలో పాల్గొనీ విజయవంతం చేయాలని పాలేరు నియోజకవర్గం ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ కోరరూ

## టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో జెడ్.ఎస్ జైపాల్, "దళిత రత్న"

# కోటపాటి.రుక్మారావుకు ఘన సన్మానం

**ఖమ్మం జిల్లా బ్యూరో అక్షర రేఖ న్యూస్ ఏప్రిల్ 10** టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో, టీఎన్జీవోస్ కేంద్ర సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ గా ఎన్నికైన జెడ్.ఎస్. జైపాల్ మరియు రాష్ట్ర ప్రభుత్వ "దళిత రత్న" అవార్డు గ్రహీత కోటపాటి రుక్మారావు లను ఘనంగా సన్మానించారు. శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా టీజీఈజేఏసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఢ టీజీవో రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ, జైపాల్ ఉద్యోగుల హక్కుల పరిరక్షణలో నిరంతరం పోరాడుతూ సంఘ బలోపేతానికి విశేష కృషి చేస్తున్నారు. ఆయన నాయకత్వం ఉద్యోగుల్లో ఐక్యత, నమ్మకాన్ని పెంపొందించింది అని ప్రశంసించారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వ "దళిత రత్న" అవార్డు గ్రహీత కోటపాటి రుక్మారావు విద్యార్థుల సంక్షేమం, సామాజిక సేవలో విశేష కృషి చేసి, ముఖ్యంగా పేద మరియు వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి అంకితభావంతో పనిచేస్తున్నారు. ఆయన సేవలు యువతకు ఆదర్శప్రాయంగా నిలుస్తాయి అని పేర్కొన్నారు.

ఇలాంటి ప్రతిభావంతులైన నాయకులను సన్మానించడం ద్వారా సంఘం మరింత బలపడుతుందని, వారి సేవలు సమాజానికి దిశానిర్దేశం చేస్తాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీఈజేఏసీ ఖమ్మం జిల్లా చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు, టీజీవో జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరావు, కార్యదర్శి మోదుగు వేలాద్రి, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి కొనిదెన



శ్రీనివాస్, అసోసియేటెడ్ ప్రెసిడెంట్ కొమరగిరి దుర్గాప్రసాద్, రెవిన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు తుంబూరు సునీల్ రెడ్డి, టీజీవో అసోసియేట్ అధ్యక్షులు మల్లెల రవీంద్ర ప్రసాద్, హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి విజయ్ కుమార్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరావు, పిఆర్టియు జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సుబ్బయ్య, హెడ్ మాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వీరాస్వామి, టీపీటీఫ్ కార్యదర్శి వెంగలరావు, యుటిఎఫ్ అధ్యక్షులు రంజాన్, టిఆర్టియు అధ్యక్ష కార్యదర్శులు శేఖర్, టీఎన్జీవోస్ మహిళా విభాగం చైర్‌పర్సన్ మృదుల, నాయకులు తాళ్లూరి శ్రీకాంత్, ఎర్రమళ్ళ శ్రీనివాసరావు, కోణార్, శ్రీధర్ సింగ్, కోడి లింగయ్య, వెక్కిరాల శ్రీనివాస్, మల్లోజు వెంకన్న, పొట్టపెంజర రామయ్య, డి ఆర్ డి ఏ.లక్ష్మణరావు, కెవి.రమణ, రవికుమార్, తాళ్లూరు చంద్రశేఖర్, గుడిపూడి శ్రీనివాస్, రమణ యాదవ్, ఎర్రమల శ్రీనివాస్, చంద్రశేఖర్ గౌడ్, ఎర్ర రమేష్, బెజ్జంకి ప్రభాకర చారి, మెట్టు వీరన్న, దిలీప్ కుమార్, విజయ్, అజ్మత్ బెగ్, గఫూర్, లింగం సురేష్ తదితరులు పాల్గొని సన్మానితులకు అభినందనలు తెలిపారు.


# ఈషా స్కూల్ లో రాయల్స్ అవార్డు వేడుక

ప్రతి చిన్నారి ప్రతిభకు గౌరవ వేదిక

ఘనంగా పిల్లల గ్రాడ్యుయేషన్ వేడుక

**జగిత్యాల,ఏప్రిల్10, అక్షర రేఖ న్యూస్** మానేరు సురేష్ జగిత్యాల పట్టణములోని గోవింద్ పల్లె లోని ఈషా స్కూల్ ఆఫ్ నాలెడ్జ్ పాఠశాల లో ఈషా రాయల్స్ అవార్డు వేడుకను ఘనంగా నిర్వహించారు ఈ వేడుక ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం కేవలం అవార్డుల పంపిణీకి మాత్రమే కాకుండా, ప్రతి విద్యార్థిలోని ప్రత్యేక ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడం, అభినందించడం, ప్రేరేపించడం లక్ష్యంగా నిర్వహించబడింది అని పాఠశాల చైర్మన్ కంది కైలాసాం తెలిపారు ఈ కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని తమ విద్యా ప్రయాణంలో ఒక ముఖ్యమైన దశను ఆనందంగా జరుపుకున్నారు.పాఠశాల ఆవరణ ఆనందోత్సాహాలతో కళకళలాడింది. విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు అందర్నీ ఆకట్టుకుని వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ సందర్భంగా నిర్వహించిన గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ల ప్రదానోత్సవం ప్రత్యేకంగా నిలిచింది. విద్యార్థులను ఒక్కొక్కరిని వేదికపైకి ఆహ్వానించి, ప్రిన్సిపల్,డైరెక్టర్లు వారి చేతుల మీదుగా గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా పిల్లలకు అభినందనలు తెలుపుతూ వారి భవిష్యత్తు విజయాల కోసం శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు గౌన్లు, టోపీలు ధరించి సర్టిఫికెట్లు స్వీకరించడం కార్యక్రమానికి మరింత ఆకర్షణను తెచ్చింది.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ రంజిత్ మాట్లాడుతూ, విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యతో పాటు మంచి విలువలు, నైతికతలను అలవర్చుకోవడం ఎంతో





ముఖ్యమని సూచించారు. పిల్లల అభివృద్ధికి తోడ్పడిన తల్లిదండ్రులకు ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తమ అంకితభావంతో విద్యార్థులను ఈ స్థాయికి తీసుకువచ్చారని కొనియాడారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం ప్రతి విద్యార్థిని జాగ్రత్తగా పరిశీలించి, వారి ప్రతిభ, కృషి మరియు ప్రగతిని ఆధారంగా తీసుకుని అవార్డులను అందచేశారు.ప్రతి చిన్నారి ప్రత్యేకమే అనే నమ్మకంతో ప్రతి విద్యార్థికి అవార్డు అందించడం ఈ కార్యక్రమం ప్రత్యేకతగా నిలిచింది. విద్యార్థులను ఈషా రాయల్స్ గా అభివర్ణిస్తూ వారిలో ప్రతి ఒక్కరూ భవిష్యత్తులో మెరుగైన స్థాయికి ఎదగగల సామర్థ్యం కలిగినవారనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కంది కైలాసం, కరెస్పాండెంట్ అన్నపూర్ణ, డైరెక్టర్ నాగమణి, అకాడమిక్ కోఆర్డినేటర్ కవిత, ప్రిన్సిపల్ రంజిత్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. వారి సమక్షం లో ఈ వేడుకకు మరింత గౌరవాన్ని మరియు ప్రత్యేకతను తీసుకువచ్చింది.తల్లిదండ్రుల చప్పట్లు, ప్రోత్సాహం మరియు హాజరు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి. కార్యక్రమం సందర్భంగా తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి ఫోటోలు తీసుకుని ఈ ఆనంద క్షణాలను స్మరణీయంగా నిలుపుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ అన్నపూర్ణ మాట్లాడుతూ, చిన్న విజయాలను గుర్తించి గౌరవించడం ద్వారా పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది వేయవచ్చని తెలిపారు. ఈ అవార్డు వేడుక విద్యార్థులకు కొత్త ఉత్సాహాన్ని నింపి, మరింత ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు ప్రేరణనిచ్చింది అని అన్నారు.

# గోడౌన్ లను ఆకస్మికంగా తనిఖీ చేసిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు..



**ఖమ్మం జిల్లా బ్యూరో అక్షర రేఖ న్యూస్ ఏప్రిల్ 10** ఖమ్మ జిల్లా,రఘునాధపాలెం లోని గిడ్డంగుల సంస్థ గోడౌన్ లను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు..గోడౌన్ లో మిల్లర్లు అప్పగిస్తున్న బియ్యాన్ని నిల్వ చేస్తున్నారు..తనిఖీల్లో భాగంగా నిల్వలకు సంబంధించిన రికార్డులు,భద్రత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు...గోడౌన్ లో



ఉన్న స్టాకు రిజిస్టర్ ను మరియు స్టాప్ రిజిస్టర్ ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు..గోడౌన్ లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని ఆశించారు...విధుల్లో ఎటువంటి అలసత్వం వహించకూడదని ఆదేశించారు..పురుగులు రాకుండా పిడియస్ పంపాలని ఆయన చెప్పారు..

## మదర్ అండ్ చైల్డ్ హాస్పిటల్ లో ఘనంగా అంతర్జాతీయ హోమియోపతి దినోత్సవం





**జగిత్యాల, ఏప్రిల్10, అక్షర రేఖ న్యూస్** మానేరు సురేష్ జగిత్యాల పట్టణములోని మదర్ అండ్ చైల్డ్ హాస్పిటల్ లో తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక 99 రోజుల ప్రణాళికలో భాగంగా, అంతర్జాతీయ హోమియోపతి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయుష్ హెల్త్ క్యాంప్‌ను జగిత్యాల శాసన సభ్యులు డా. సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హోమియోపతి ప్రాచీన వైద్య విధానమని,ప్రజలకు నాణ్యమైన, అందుబాటులో ఉన్న ఆరోగ్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆయుష్ వైద్య విధానాలు (యోగా, ఆయుర్వేదం, హోమియోపతి, యునాని) ఆరోగ్య సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ప్రత్యేకంగా, ఈ హెల్త్ క్యాంప్ ద్వారా ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు, ఔషధాలు అందించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్నివినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమములో జిల్లా మెడికల్ హెల్త్ అధికారి జి. సుజాత, కౌన్సిలర్ ప్రశాంత్ రావు, డాక్టర్లు, ప్రజలు పాల్గొన్నారు.

## మంచుకోండ లిఫ్ట్ ద్వారా చెరువులు నింపుతున్న దృశ్యాన్ని పరీశీలించిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు,డిసిసి మాజీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్..



**ఖమ్మం జిల్లా బ్యూరో అక్షర రేఖ న్యూస్ ఏప్రిల్ 10** ఖమ్మం నియోజకవర్గం రఘునాథపాలెం మండలంలోని మంచుకోండ లిఫ్ట్ ద్వారా రఘునాథపాలెం మండలంలోని చెరువులు నింపుతున్న దృశ్యాన్ని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు,డిసిసి మాజీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పరీశీలించారు..ఎండాకాలంలో అన్ని చెరువులు నింపడం పట్ల రైతులు హార్షం వ్యక్తం చేశారు..ఈ కార్యక్రమంలో ఓబీసీ సెల్ అధ్యక్షులు పుచ్చలకాయల వీరభద్రం తదితరులు పాల్గొన్నారు..

## అశ్వారావుపేట లో కస్టమర్లపై వీఘా ఫుడ్ కోర్టు సిబ్బంది దాడి.

## పోలీస్ స్టేషన్ లో జనం న్యూస్ రిపోర్టర్ కంప్లైంట్.



**అశ్వారావుపేట ఏప్రిల్ 10(అక్షర రేఖ)**అశ్వారావుపేటలోని కాకతీయ గేట్ దగ్గర ఉన్న వీఘా ఫుడ్ కోర్టులో 05/04/2026(ఆదివారం) రాత్రి జనం న్యూస్ రిపోర్టర్ తనగల శివ శంకర్ అశ్వారావుపేట నుండి ఎవీ బంజార వెళ్తు ఫ్రైడ్ రైస్ పార్సిల్ తీసుకోని వెళ్ళి మధ్యలో ఆకలి వెయ్యగా తినడాన్నికి ఆ పార్సిల్ ఓపెన్ చెయ్యగానే ఆ ఫ్రైడ్ రైస్ దురవాసన రావడంతో ఆ పార్సిల్ ని అక్కడే పడేసారు. ఈ రోజు అదే వీఘా ఫుడ్ కోర్టు కి టీ తాగడాన్నికి తన ఫ్రెండ్ తో కలిసి వెళ్లిన శివ శంకర్. అక్కడ ఉన్న సిబ్బంది తో గతంలో జరిగిన విషియం గురించి చెప్పి ఈ సారి ఏదైనా ఫుడ్ పార్సిల్ ఇచ్చేటప్పుడు చూసుకొని ఇవ్వండి అని చెప్పగా. అక్కడ ఉన్న సిబ్బంది నోటికి వచ్చినట్టు తిట్టారు అని అక్కడ ఉన్న వీఘా ఫుడ్ కోర్టు ఓనర్ కి విషియం తెలియజేయగా వాళ్ళ సిబ్బందితో కలిసి కులం పేరుతో తనని దూషించారు అని అదే సమయంలో అక్కడ కి వచ్చిన శివ శంకర్ వాళ్ళ అమ్మ ఏమైంది అని అడగగా వీఘా ఫుడ్ కోర్టు ఓనర్ కుర్చీతో వాళ్ళ అమ్మను కొట్టబోయాడు అని పోలీస్ స్టేషన్ లో జనం న్యూస్ రిపోర్టర్ శివ శంకర్ కంప్లైంట్ ఇవ్వడం జరిగింది

# నెలాఖరుకు 10 వేల ఇందిరమ్మ ఇండ్లు గృహప్రవేశానికి సిద్ధం చేయాలి...

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**
**వేగంగా నిర్మాణ పనులు జరిగేలా చర్యలు చేపట్టాలి**
**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిని అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్**

**ఖమ్మం, జిల్లా బ్యూరో అక్షర రేఖ న్యూస్ ఏప్రిల్ - 10**

జిల్లాలో నెలాఖరుకు 10 వేల ఇందిరమ్మ ఇండ్లు గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని, ఈ దిశగా ప్రణాళికాబద్ధ కార్యాచరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి, ఎంపిడిఓ లు, తహశీల్దార్లు, హౌజింగ్ అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 10 వేల ఇండ్లు గృహప్రవేశాలకు లక్ష్యంగా కార్యాచరణ చేసినట్లు తెలిపారు. అధికారులు లబ్ధిదారులకు అన్నివిధాల సహాయ సహకారాలు అందించి, లక్ష్యసాధనకు చర్యలు చేపట్టాలన్నారు.జిల్లాలో 9199 ఇందిరమ్మ ఇండ్లు స్లాబ్ లు వేసినట్లు, 2018 ఫీనిషింగ్ పూర్తయినట్లు కలెక్టర్ అన్నారు. ఇట్టి ఇందిరమ్మ ఇండ్లలో 10 ఏప్రిల్ నాటికి 1439 ఇండ్లు, 17 ఏప్రిల్ నాటికి 2794 ఇండ్లు, 24 ఏప్రిల్ నాటికి 2794 ఇండ్లు, 30 ఏప్రిల్ నాటికి మిగిలిన 2973 ఇండ్లు గృహ ప్రవేశాలకు పకడ్బందీ కార్యాచరణ చేయాలన్నారు.





జిల్లాలో మొదటి విడతగా 16497 ఇందిరమ్మ ఇండ్లు మంజూరుచేసినట్లు కలెక్టర్ అన్నారు. ఇందులో 1912 ఇండ్ల నిర్మాణం ఇంకనూ ప్రారంభించలేదని, 2520 ఇండ్ల నిర్మాణాలు పూర్తయి, గృహ ప్రవేశాలు జరగగా, మిగతా ఇండ్లు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. వెలుగుమట్లలో మంజూరు చేసిన 311, వివిధ మండలాల్లో మంజూరు చేసిన 101 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు యుద్ధప్రాతిపదికన ప్రారంభించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. లబ్ధిదారులకు కావాల్సిన అన్ని సహాయ సహకారాలు అందించాలని, క్షేత్ర అధికారులు క్రియాశీలకంగా ఉంటూ, పనుల్లో రోజువారీ ప్రగతి ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అధికారులు నిరంతర సమీక్షలు చేస్తూ, పనుల పురోగతిపై పర్యవేక్షణ చేయాలన్నారు.ఈ సమీక్ష లో హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, జిల్లాలోని ఎంపిడిఓ లు, తహశీల్దార్లు, హౌజింగ్ ఇంజనీర్లు, తదితరులు పాల్గొన్నారు.

# అజరామరుడు మహ్మద్ రజబ్డీ

**ఆశయ సాధనకు పునరంకితమవుదాం**
**సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**

**ఖమ్మం జిల్లా బ్యూరో అక్షర రేఖ న్యూస్ ఏప్రిల్ 10**

ఖమ్మం తుదిశ్వాస వరకు పేదల అభ్యున్నతి కోసం, సమాజాభివృద్ధి కోసం పనిచేసిన మహ్మద్ రజబ్ అజరామరుడని సూర్యచంద్రులు ఉన్నంత కాలం ఆయన పేరు నిలిచి ఉంటుందని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా, ప్రజాప్ర తినిధిగా పనిచేసిన రజన్అలీ -ఆదర్శంగా నిలిచారన్నారు. రజబ్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక గిరిప్రసాద్ భవన్లో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ దిగువ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన మహ్మద్ రజబ్డి ప్రభుత్వ ఉపాధ్యాయునిగా జీవితాన్ని ప్రారంభించిన ఆయన ప్రభుత్వ ఉద్యోగం తృప్తినివ్వలేదని కొంత కాలం ప్రభుత్వ ప్రెస్లో అనువాదకునిగా పనిచేసిన రజన్అలీ ఆ తర్వాత ఆంధ్రమహాస భలో చేరారని సురేష్ తెలిపారు. ఖమ్మం జిల్లాలో జరిగిన రెండు చారిత్రిక ఉద్యమాలకు ఆయన నాయకత్వం వహించారన్నారు. ఖమ్మంలో రైలు పట్టాల ఉద్యమానికి రజన్అలీ -నేతృత్వం వహించారని తెలిపారు. నాగార్జున సాగర్ సాధనోద్యమంలోనూ పనిచేశారన్నారు. సాయుధ పోరాట కాలంలో తుపాకీ పట్టి పోరాడిన ఆయన సుమారు ఐదేండ్ల పాటు జైలు జీవితం గడిపారన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర



ఉపాధ్యక్షునిగా, జిల్లా కార్యవర్గ సభ్యునిగా, శాసనసభ పక్షనేతగా, బహుముఖ పదవులలో పనిచేసి ఆయన వన్నెతెచ్చారన్నారు. ఆరు సార్లు శాసనసభ్యునిగా ఎన్నికై శాసనసభలో తన గళాన్ని పేద ప్రజల కోసం విప్పారన్నారు. పేదలకు ప్రభుత్వమే ఇండ్లు నిర్మించి -ఇవ్వాలన్న తొలి ప్రతిపాదన మహ్మద్ రజన్అలీదేనన్నారు. మారిన కాలమాన పరిస్థితులకు అనుగుణంగా రజస్అలీ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సురేష్ పిలుపునిచ్చారు. ఒకపక్క పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలు, మరో పక్క పెరుగుతున్న ఆర్థిక అంతరాల నడుమ సామాన్యులు బతకలేని పరిస్థితి ఏర్పడిందని సురేష్ తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ - నేతృత్వాన ప్రజా పోరాటాలు కొనసాగించడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా - సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు ఎస్కె జానిమియా, ఏపూరి లతాదేవి, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, సిహెచ్ సీతామహాలక్ష్మి, మేకల శ్రీనివాసరావు, వై. సాంబశివరెడ్డి, జిల్లా కౌన్సిల్ -సభ్యులు తాటి నిర్మల, కె. శ్రీనివాసరావు, ఎస్కె సైదా, మోహన్రావు, నాయకులు నంబూరి శంకర్రావు, యాకయ్య, దుర్గానాథ్ తదితరులు పాల్గొన్నారు.

## కూచుమంచి మండలం నేలపట్ల గ్రామ పరిధిలోని వెంకటరాపురం దీపాంగి శ్రీకాంత్, వీర కుమారి దంపతుల ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం



**మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి**

**ఖమ్మం జిల్లా బ్యూరో అక్షర రేఖ న్యూస్ ఏప్రిల్ 10**


ఈ సందర్భంగా నేలపట్ల గ్రామపంచాయతీ సర్పంచ్ నూకల శోభన్ బాబు మరియు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మంత్రి వెంట ఉండి ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేయటం జరిగింది పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల చివరిలో పదివేల ఇల్లు గృహప్రవేశం చేయాలని ఈ సందర్భంగా ప్రస్తావించారు. లబ్ధిదారులను ఉద్దేశించి నేలపట్ల గ్రామ సర్పంచి నూకల శోభన్ బాబు ఇల్లు తొందరగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. లబ్ధిదారులు సకాలంలో ఇల్లు నిర్మించి తొందరగా గృహప్రవేశం చేయాలని కోరారు. ఇల్లు బిల్లు తొందరగా వచ్చేలా ప్రయత్నం చేస్తానని చెప్పారు నూకల శోభన్ బాబు గ్రామ సర్పంచి నేలపట్ల.

## బీఆర్ఎస్ పార్టీలో చేరడం పక్కా: మాజీ మంత్రి జీవన్ రెడ్డి

**జగిత్యాల :** రేవంత్ రెడ్డి పాలన కన్నా కేసీఆర్ పాలన బాగుందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. 10 సంవత్సరాల కేసీఆర్ పాలనకు కాంగ్రెస్ పాలన తిరోగమనంలో నడుస్తుందని వెల్లడించారు. గురువారం జగిత్యాలలో ఆయన మీడియాతో మాట్లాడారు. నష్టపోయి న ప్రతి రైతును గత ప్రభుత్వం ఆదుకుందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోయిందని విమర్శించారు.

## మర్రిగూడ ఎస్సీ కాలనీలో దౌర్జన్యం..! గోడ కూల్చివేతతో కుటుంబం కన్నీళ్లు





**సొంతింటి కల నెరవేర్చుకుంటున్న సమయంలో షాక్**
**అసభ్య దూషణలు.. కార్మికులకు అవమానం -- బాధితుల ఆరోపణలు**
**అధికారులు వెంటనే స్పందించాలంటూ గ్రామస్తుల డిమాండ్**

**మర్రిగూడ, ఏప్రిల్ 20 (అక్షర రేఖ ):**

మర్రిగూడ మండలంలోని ఎస్సీ కాలనీలో ఓ కుటుంబంపై జరిగిన అన్యాయం స్థానికంగా తీవ్ర ఆగ్రహానికి దారితీసింది. ఈద కాశి కుటుంబం సొంత ఇంటి నిర్మాణంలో భాగంగా నిర్మించిన గోడను పక్కనే నివసించే వ్యక్తులు అన్యాయంగా కూల్చివేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బాధితుల వివరాల ప్రకారం, గోడను కూల్చివేయడమే కాకుండా, వారిని అసభ్య పదజాలంతో దూషించడం, ఇంటి నిర్మాణ పనులకు వచ్చిన కార్మికులను అవమానించడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ చర్యల వల్ల కుటుంబం తీవ్ర మానసిక వేదనను అనుభవిస్తోంది.

బాధిత కుటుంబం వేదన "రూపాయి రూపాయి కూడబెట్టి ఇల్లు కట్టుకుంటున్నాం... ఇలా గోడ కూల్చేయడం చాలా బాధగా ఉంది. మాకు న్యాయం చేయాలి" -- ఈద కాశి కుటుంబం

స్థానికుల ఆగ్రహం "చట్టాన్ని పట్టించుకోకుండా ఇలా ప్రవర్తించడం తప్పు. వెంటనే చర్యలు తీసుకోవాలి" -- గ్రామస్తులు ఈ ఘటనపై గ్రామ ప్రజలు తీవ్రంగా స్పందిస్తూ, సంబంధిత అధికారులు వెంటనే దర్యాప్తు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. సొంత ఇంటి కలను నెరవేర్చుకోవాలనుకున్న కుటుంబం ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొనడం బాధాకరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## 28వ వార్షికోత్సవ సందర్భంగా అంగరంగ వైభవంగా శ్రీ పెద్దిరాజు పెద్దమ్మ కళ్యాణ మహోత్సవం....





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి; ఏప్రిల్ 10.(అక్షర రేఖ న్యూస్);**

కామారెడ్డి జిల్లా దోమకొండ గ్రామంలోని శ్రీ వనదుర్గ పెద్దమ్మ దేవాలయంలో ఈ సందర్భంగా దేవాలయ 28వ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకొని శుక్రవారం ఉదయం 10:45 గంటలకు ఉత్తరాషాడ నక్షత్ర యుక్త మిథున లగ్న పుష్కరాంశ సముహూర్తంలో పెద్దమ్మ-పెద్దిరాజుల కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది.అనంతరం ఓడి బియ్యం సమర్పణ, అమ్మవారి ఊరేగింపు, సాయంత్రం భక్తులు బోనాలు సమర్పించారు.ఈ మహోత్సవాల్లో భాగంగా అమ్మవారికి అభిషేకం మరియు పూజలు నిర్వహించి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి ఆశీర్వాదాలు పొందుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు నాగరపు ఎల్లయ్య, గౌరవ అధ్యక్షులు పున్న లక్ష్మణ్ , ఉపాధ్యక్షులు అబ్రబోయిన పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి అబ్రబోయిన రాజేందర్, ఉప కార్యదర్శి బట్టు రాజు, కోశాధికారి గంప సంతోష్, సర్పంచ్ ఐరన్ నరసయ్య, మాజీ జెడ్పిటిసి తీగల తిరుమల్ గౌడ్, కాంగ్రెస్,పట్టణ అధ్యక్షులు సీతారాం మధు, ఉపసర్పంచ్ బొమ్మెర శ్రీనివాస్ వార్డు మెంబర్ కటిక శ్రీనివాస్, బత్తిని సిద్ధ రాములు, ఐరెన్ రాజేందర్, పాలకుర్తి శేఖర్, మాజీ బిక్నూర్ మార్కెట్ చైర్మన్ కుంచాల శేఖర్, కనుగంటి నాగరాజ్, కదారి రమేష్ పెద్దమ్మ గుడి ఆలయ కమిటీ సభ్యులు, ముదిరాజ్ సంఘం నాయకులు మరియు భక్తులు పాల్గొన్నారు.

## చింతపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో స్వచ్ఛ భారత్ టాయిలెట్ల నిర్మాణం పూర్తి... విద్యార్థులకు ఉపయోగకరం



**చింతపల్లి, ఏప్రిల్ 10 (అక్షర రేఖ):**

చింతపల్లి మండలం కుర్మపల్లి గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా మంజూరు చేసిన మరుగుదొడ్ల నిర్మాణం విజయవంతంగా పూర్తయింది. ఈ సందర్భంగా నేడు నిర్వహించిన కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి అంజయ్య గారు, గ్రామ సర్పంచ్ కట్టా మహేష్ గారు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మా చారి గారు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మారెడ్డి నారాయణ రెడ్డి గారు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా నూతనంగా నిర్మించిన బాలురు, బాలికల మరుగుదొడ్లను పరిశీలించిన అధికారులు పాఠశాలలో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత పరిరక్షణలో ఈ మరుగుదొడ్లు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. అలాగే ఈ నిర్మాణ పనులను పూర్తి చేయడంలో సహకరించిన గ్రామ సర్పంచ్ కట్టా మహేష్ గారిని, పాఠశాల సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినీలు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.గ్రామస్థులు, విద్యార్థులు ఈ అభివృద్ధి కార్యక్రమంపై ఆనందం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

## తాహసీల్దార్ కు సన్మానం సమస్యలు పరిష్కరించాలని వినతి

**ఇచ్చోడ, ఏప్రిల్ 10, (అక్షర రేఖ) :**

ఇచ్చోడ మండలం తహసీల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన ఇమ్రాన్ ఖాన్ ను శుక్రవారం ఇచ్చోడ మండలం లోని మాదాపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ షేక్ ఇమ్రాన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్ షాదుల్లా మర్యాద పూర్వ కంగా కలిశారు. అనంతరం శాలువతో సత్కరించారు. మాదాపూర్ గ్రామానికి సంబంధించిన సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసు కెళ్లారు. వాటిని పరిష్కరించి చొరవ చూపాలని వారు విన్నవించారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తాహశీల్దార్ వారికి హామీ ఇచ్చారు. అందరి సహకారంతోనే గ్రామా లను అభివృద్ధి సాధ్యమవు తుందని ఆయన పేర్కొన్నా రు. ఈ కార్యక్రమం లో స్తానిక డిప్యూటీ తాహసీల్దార్ జాదవ్ రమేష్, మాదాపూర్ పంచా యతీ కార్యదర్శి ఈజాజ్ హమీ్మి, సిబ్బంది పాల్గొన్నారు



# డిజిటల్ సాంకేతికతతో అంగన్‌వాడీ సేవల మెరుగుదల

**అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది**
**11,650కు పారదర్శక టెండర్ ద్వారా స్మార్ట్‌ఫోన్‌ల కొనుగోలు**
**త్వరలోనే 15 వేల అంగన్వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్**
**సిబ్బంది సంక్షేమం, వేతనాల పెంపుపై సానుకూల నిర్ణయం త్వరలో**
**అంగన్వాడి టీచర్లకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి ధనసరి అనసూయ ( సీతక్క)**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో అక్షర రేఖ న్యూస్ ఏప్రిల్ 10**





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయంలో శుక్రవారం పోషణ్ పక్వాడ కార్యక్రమం ప్రారంభోత్సవం, అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్‌ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించబడింది. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దానసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఆదివాసి సంప్రదాయమైన కొమ్ము నృత్యంతో స్వాగతం పలికిన అనంతరం మంత్రి మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాళ్లను సందర్శించి, అంగన్‌వాడీ సిబ్బంది తయారు చేసిన ఆహార పదార్థాలు, పిల్లలకు అర్థమయ్యే విధంగా రూపొందించిన విద్యా నమూనాలను పరిశీలించారు. అనంతరం సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. “బేటీ బచావో” పథకం కింద ఆడపిల్లల తల్లులకు హిమాలయ కిట్లను అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోషకాహార కార్యక్రమాలు రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని అభినందించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న స్మార్ట్‌ఫోన్‌ల పంపిణీ ద్వారా సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పిల్లల బరువు, పోషకాహార వివరాలు, గర్భిణీలు, బాలింతల ఆరోగ్య సమాచారాన్ని డిజిటల్ విధానంలో నమోదు చేయడం ద్వారా పారదర్శకత, వేగం పెరుగుతాయని వివరించారు. స్మార్ట్‌ఫోన్‌ల కొనుగోలు ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా నిర్వహించబడిందని మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఓపెన్ టెండర్ విధానంలో కొనుగోలు చేపట్టగా ప్రారంభంలో సుమారు ?14,000 వరకు ధరలు వచ్చినప్పటికీ పలు దఫాల టెండర్ ప్రక్రియ అనంతరం ఒక్కో ఫోన్‌ను ?11,650కు పొందగలిగామని తెలిపారు. ప్రజల డబ్బు ఆదా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని మంత్రి సూచించారు. గత ప్రభుత్వం ఐదు సంవత్సరాల క్రితం ?9,000కు ఫోన్లు కొనుగోలు చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ప్రస్తుతం చేపట్టిన పారదర్శక విధానంపై దుష్ప్రచారం జరుగుతోందన్నారు. ప్రభుత్వం వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని, భద్రాద్రి కొత్తగూడెం వంటి జిల్లాల్లో అంగన్‌వాడీలలో బ్రేక్‌ఫాస్ట్ పథకాలను పైలట్ ప్రాజెక్టులుగా అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి 12 వేల భవనాలు మంజూరు చేయడం, మినీ కేంద్రాల అప్‌గ్రేడేషన్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు వంటి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద ఇప్పటివరకు సుమారు ?8 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. జీవో విడుదలకు ముందే రిటైర్ అయిన వారికి కూడా ఈ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, వేతనాల పెంపు అంశాన్ని పరిశీలిస్తున్నామని, త్వరలో సానుకూల నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారు. అదేవిధంగా సుమారు 15 వేల ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. అంగన్‌వాడీ టీచర్లకు కేంద్ర ప్రభుత్వం కేవలం ?2,800 మాత్రమే అందిస్తోందని, మిగతా భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోందని తెలిపారు. జీతభత్యాల పెంపు కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో 275 మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సేవలు అందిస్తున్నామని తెలిపారు. త్వరలో నిపుణులు, అంగన్‌వాడీ టీచర్లతో కమిటీ ఏర్పాటు చేసి అభివృద్ధి చర్యలపై మేధోమథనం నిర్వహిస్తామని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను పోషకాహార లోపం లేని జిల్లా, బాల్య వివాహాలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ టీచర్లు పిల్లలను తమ సొంత పిల్లలుగా భావించి సేవలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బందికి స్మార్ట్‌ఫోన్‌లు అందించడం ద్వారా సేవల సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం మహిళలు, చిన్నారుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ అంగన్‌వాడీ సేవలను ఆధునికీకరించడంలో ఈ కార్యక్రమం కీలకమని, కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ అంగన్‌వాడీ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో స్మార్ట్‌ఫోన్‌ల పంపిణీ కీలకమని పేర్కొన్నారు. అశ్వరావుపేట నియోజకవర్గంలో ఆధునిక సౌకర్యాలతో అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇచ్చామని, చెంద్రుగొండ మండలం మద్దుకూరు కేరళ తరహాలో అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు అన్ని కేంద్రాలకు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని వివరించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టుల విస్తరణతో సేవలు మరింత విస్తరించాయని తెలిపారు. అంగన్‌వాడీ సిబ్బందికి జీతభత్యాలు పెంపు, సంక్షేమ చర్యలు మరింత విస్తరించాలని మంత్రి ని కోరారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో 1954 అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్‌ల పంపిణీ చేయడం ద్వారా ఐసీడీఎస్ సేవలు మరింత సమర్థవంతంగా అమలు అవుతాయని తెలిపారు. డేటా సేకరణ, నివేదికల పంపిణీ, లబ్ధిదారుల వివరాల నిర్వహణ సులభతరం అవుతుందని చెప్పారు. జిల్లాలో మొత్తం 2061 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, అన్ని అంగన్వాడీ కేంద్రాలలో విద్యుదీకరణ పనులు పూర్తి చేశామని రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉన్నామని తెలిపారు. 197 పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. పిల్లల వివరాల నమోదు, పోషకాహారం పంపిణీ వంటి కార్యక్రమాల్లో ఇవి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు .ఐఅనంతరం మంత్రి చేతుల మీదుగా అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈఓ నాగలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత, జిల్లా అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చెవి పూర్తిగా వేరైన రోగికి విజయవంతమైన శస్త్రచికిత్స కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల నైపుణ్యం



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో అక్షర రేఖ న్యూస్ ఏప్రిల్ 10**

భద్రాద్రి కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని ఈఎన్?టి విభాగం వైద్యులు మరోసారి తమ నైపుణ్యాన్ని చాటుతూ ఒక క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. చుంచుపల్లి మండలం రామవరం గ్రామానికి చెందిన నిర్మల (40), భర్త రాయమల్లు, 09-04-2026న తీవ్రమైన గాయంతో ఆసుపత్రిలో చేరారు. ఆమెకు Grade-4 traumatic avulsion of pinna (చెవి భాగం పూర్తిగా వేరైపోవడం) అనే అరుదైన మరియు ప్రమాదకర పరిస్థితి ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ క్లిష్ట పరిస్థితిని సవాల్‌గా తీసుకున్న ఈఎన్?టి విభాగం వైద్య బృందం అత్యంత జాగ్రత్తగా, నైపుణ్యంతో శస్త్రచికిత్స నిర్వహించి చెవి భాగాన్ని పునఃస్థాపన చేయడంలో విజయాన్ని సాధించింది. శస్త్రచికిత్సకు ముందు మరియు అనంతరం పరిస్థితులు కేసు తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తున్నాయి. ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉండి, వైద్యుల పర్యవేక్షణలో మెరుగుదల దిశగా ఉంది. ఈ శస్త్రచికిత్సను డాక్టర్ శాంసన్ ఆధ్వర్యంలో ఈఎన్?టి వైద్య బృందం విజయవంతంగా పూర్తి చేసింది. ఈ సందర్భంగా ఈఎన్?టి ఫ్యాకల్టీ, అనస్థీషియా విభాగం వైద్యులు, ఆపరేషన్ థియేటర్ నర్సింగ్ సిబ్బంది మరియు టెక్నీషియన్‌లు సమిష్టిగా చేసిన కృషి ప్రశంసనీయం. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ అత్యాధునిక, నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని ఈ విజయవంతమైన శస్త్రచికిత్స మరోసారి రుజువు చేసింది.

## మధ్యల శిరీష ఎట్టయ్య గౌడ్ పెళ్లిరోజు వేడుకలు ఘనంగా



**ప్రజల మనసు గెలుచుకున్న నాయకుడికి శుభాకాంక్షల వెల్లువ**

**చింతపల్లి, ఏప్రిల్ 10 (అక్షర రేఖ ):**

చింతపల్లి మండలం గోడకొండ్ల గ్రామం మాల్ వెంకటేశ్వర్ నగర్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ప్రజల మధ్య అన్నగా పేరుపొందిన మధ్యల శిరీష ఎట్టయ్య గౌడ్ పెళ్లిరోజు వేడుకలు శుక్రవారం సాయంత్రం అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి. ప్రజల సమస్యలపై ఎప్పుడూ ముందుండి స్పందించే నాయకుడిగా, ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచే వ్యక్తిగా పేరు తెచ్చుకున్న మధ్యల శిరీష ఎట్టయ్య గౌడ్‌కు ఈ సందర్భంగా అభిమానులు, పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, స్థానిక ప్రజలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. కార్యక్రమం మొత్తం ఆనందోత్సాహాల మధ్య సాగింది.

# కోడూర్‌లో వైభవంగా శ్రీ బీరప్ప కామరాతి విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం

**రఘునాథపల్లి/ అక్షర రేఖ) ఏప్రిల్ 10:**

**జిల్లా ప్రతినిధి రాస మల్ల మల్లేష్ /**





జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కోడూర్ గ్రామంలో శ్రీ బీరప్ప-కామరాతి స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వేడుకలు నాలుగు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో కొనసాగనున్నాయి. ?శుక్రవారం విగ్రహాల నగర సంకీర్తన ఉత్సవాల్లో భాగంగా గురువారం గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభం కాగా, శుక్రవారం ఉదయం 8 గంటల నుండి గ్రామంలో విగ్రహాల నగర సంకీర్తన నిర్వహించనున్నారు. గ్రామ పురవీధుల గుండా మంగళవాయిద్యాల మధ్య విగ్రహాల ఊరేగింపు జరగనుంది. ?ముగింపు వేడుకలు ?శనివారం (ఏప్రిల్ 11) ఉదయం హోమం, జలాభిషేకం, పుష్పాభిషేకం, ధాన్యాభిషేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ?ఆదివారం (ఏప్రిల్ 12)శ్రవణ నక్షత్రయుక్త శుభలగ్నమందు ఉదయం 9:30 గంటలకు అక్కమ్మహంకాళి, బీరప్ప-కామరాతి, బుగ్గ పోచమ్మల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం జరగనుంది. అనంతరం మధ్యాహ్నం భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కురుమ సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులు జోగు గట్టయ్య,గొరిగే భాస్కర్ రేగు భాస్కర్,సానికచంద్రయ్య గొరిగే యాదయ్య కొల్పుల వెంకన్న,భూష కుమార్ కొడే వినోద్,కుల పెద్ద మనుషులు గొరిగే పెద్ద యాదయ్య, కర్రె రాములు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక చేయూత



**చిన్నారులకు రూ.45,000 పిక్స్ డిపాజిట్ చేసిన: తోటి స్నేహితులు**

**తరిగొప్పుల(అక్షర రేఖ)ఏప్రిల్:10**

తరిగొప్పుల: తమతో కలిసి చదువుకున్న మిత్రుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆర్థిక చేయూతనందించి అతడి కుటుంబానికి తోటి స్నేహితులు అండగా నిలిచారు. తరిగొప్పుల మండల కేంద్రానికి చెందిన చిలువేరు రమేష్ 2009-10లో తరిగొప్పుల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్నాడు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో సమాచారం తెలుసుకున్న తనతో కలిసి చదువుకున్న స్నేహితులందరూ కలిసి వారి ఇంటికెళ్ళి అతడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం రూ. 45000లు ఆర్థిక సహాయం రమేష్ ఇద్దరు కుమార్తెల పేర్ల మీద పిక్స్ డిపాజిట్ చేసి, భరోసా కల్పించారు.


**ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారి పేర్లు.**

ఏదునూరి కరుణాకర్, సురేష్, రవి, శ్రీధర్, కనకరాజు, రాజు, కళింగ రాజు. అనిల్, ఐ చింతల అశ్విని , రేణుక, హేమలత, రమ్య, మౌనిక, భూలక్ష్మి, లక్ష్మీ దుర్గ, గాయని భవాని, తదితరులు పాల్గొన్నారు.

## ఐపీఎల్ సీజన్ నేపథ్యంలో యువతకు హెచ్చరిక -- బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్‌కు దూరంగా ఉండాలి

**‘ఈజీ మనీ ఆశతో జీవితాలను పాడు చేసుకోవద్దు” -- చింతపల్లి ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి సూచన**

**చింతపల్లి ఏప్రిల్ 10 (అక్షర రేఖ ప్రతినిధి )**



ఐపీఎల్ 2026 సీజన్ కొనసాగుతున్న నేపథ్యంలో యువత అప్రమత్తంగా ఉండాలని చింతపల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి హెచ్చరించారు. క్రికెట్ మ్యాచ్‌ల పేరుతో జరుగుతున్న బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ జూదాలు యువకుల జీవితాలను ప్రమాదంలోకి నెడుతున్నాయని తెలిపారు. ప్రత్యేకంగా “ఈజీ మనీ” ఆశతో బెట్టింగ్‌లకు అలవాటు పడితే ఆర్థికంగా మాత్రమే కాకుండా మానసికంగా కూడా తీవ్ర నష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఆన్‌లైన్ గేమ్స్ పేరుతో మోసపోతున్న ఘటనలు పెరుగుతున్నాయని, యువత ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కోట్స్: “ఒక్కసారి బెట్టింగ్ అలవాటు పడితే బయటపడటం చాలా కష్టం. యువత తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇలాంటి వాటికి దూరంగా ఉండాలి.” “తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలపై పర్యవేక్షణ పెంచాలి. అనుమానాస్పద లావాదేవీలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.”
ముగింపు:యువత తమ సమయాన్ని క్రీడలు, చదువు మరియు సృజనాత్మక కార్యకలాపాలపై కేంద్రీకరించాలని, బెట్టింగ్ మరియు జూదాల వంటి ప్రమాదకర అలవాట్లకు దూరంగా ఉండాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## వెల్ది మోడల్ స్కూల్లో పోషక ఆహార బ్యాగుల పంపిణీ



**రఘునాథ్ పల్లి / అక్షర రేఖ ఏప్రిల్10:**

మండలం లోని వెల్ది మోడల్ స్కూల్లో జనగామ జిల్లా ప్రభుత్వ మహిళా సాధికారత సంస్థ ఆధ్వర్యంలో పోషక ఆహార కిట్లని విద్యార్థులకు అందజేశారు. గతంలో పాఠశాలలోని విద్యార్థినులందరికీ హిమోగ్లోబిన్ మరియు పోషక విలువల పరీక్షలు నిర్వహించి ఆరుగురు విద్యార్థినులో లోపాన్ని గ్రహించినారు. పాఠశాల ప్రిన్సిపల్ పాలకుర్తి శ్రీధర్, జిల్లా మహిళా సాధికారత సంస్థ పంపించిన పోషకాహార బ్యాగులని విద్యార్థినులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ పిల్లలు పోషక విలువలు కలిగిన ఆహారన్ని తీసుకున్నట్లయితే, భవిష్యత్తులో వారికి రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గణేష్ కందగట్ల, తుమ్మ రవి, శశి కుమారి, వసంత మాధురి, మాలతి,సురేఖ, పాల్గొన్నారు

# మా ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి

**ఒకే సమస్య ఒకే సర్వీస్ రూల్ అమలు చేయాలి.**
**ఆర్టిజన్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి.**
**జేఏసీ ఆధ్వర్యంలో వంట వార్పు ,కళ్లకు గంతలు కట్టి నిరసన తెలపడం జరిగింది.**





పటాన్చెరు ఏప్రిల్ 10 (అక్షర రేఖ న్యూస్)

విద్యుత్ ఆర్టిజన్, మీటర్ రీడర్లను, పీస్ రేట్ కార్మికులను, ప్రభుత్వఉద్యోగులుగా గుర్తించాలని మూడవరోజు నిరవధిక సమ్మెలో భాగంగా పటాన్చెరు డివిజన్ కార్యాలయం ఎదుట వంటావార్పు మరియు కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన తెలుపడం జరిగింది. అనంతరం రాష్ట్ర డివిజన్ జేఏసీ నాయకులు భూపాల్ రెడ్డి ,పర్వయ్య ,రఘు మాట్లాడుతూ ఒకే సమత్సలో రెండు రూల్స్ అమలు చేయడం కరెక్ట్ కాదని, చేస్తున్న పని ఒకటే అయినప్పుడు రెండు రూల్స్ అమలు చేయడాన్ని తప్పు పట్టారు ఒకే సంస్థలో ఒకే పని చేస్తున్నప్పుడు రెండు రూల్స్ అమలు చేసి బ్రిటిష్ కాలం నాటి రూల్స్ ను అమలు చేసి కార్మికుల జీవితాలతో శ్రమ దోపిడీకి గురిచేస్తున్న యాజమాన్యం ప్రభుత్వం దిగి వచ్చేవరకు నిరవధిక సమ్మె కొనసాగుతుందని తెలిపారు అప్పటి కాంగ్రెస్ సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆర్టిజన్ కార్మికుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించారు పాదయాత్రలో హామీ ఇచ్చారు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత తమ హక్కులను నెరవేర్చేందుకు ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని అన్నారు ఈరోజు ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తర్వాత విద్యుత్ శాఖ మంత్రిగా పనిచేస్తున్న భట్టి విక్రమార్క గారు మాట మార్చడం బాగోలేదని విద్యుత్ కార్మికులను పట్టించుకోవడంలేదని తెలిపారు విద్యుత్ సమస్యలు ఏదైనా తలెత్తే మాత్రం యాజమాన్యం ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు ఈ కార్యక్రమానికి జిల్లా జేఏసీ నాయకులు పలు యూనియన్ల సంఘాల అధ్యక్షులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో రమేష్ నాయక్, ఉపేందర్, నరసింహ, అక్షయ్, ముజీబ్, మురళి, సుధాకర్ ఎల్లేష్ కార్మికులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్‌ను చెట్టుకు కట్టేసిన వైనం..

## తాళ్లతో చెట్టుకు కట్టి అవమానించిన గ్రామస్తులు...

**సంగారెడ్డి** : దామరగిద్ద గ్రామంలో అమానుషం..హెచ్‌బీఎం ఫైనాన్స్ పేరుతో అంగన్‌వాడీ టీచర్ వసంత కుమారి భర్త ప్రభాకర్ గ్రామంలోని పలువురి వద్ద డబ్బులు తీసుకొని పారిపోయాడు.. ..దీంతో అంగన్ వాడీ టీచర్ ను తాళ్లతో చెట్టుకు కట్టి గ్రామస్తులు అవమానించారు. ఘగనపై పోలీసులు విచారణ ప్రారంభించారు.

## మాచవరంలో మంచినీటి చలివేంద్రం ప్రారంభం

**మాచవరం** : మండల కేంద్రమైన మాచవరం కిరాణా మర్చంట్ బజార్లో గురువారం వివిధ గ్రామాల నుండి వచ్చే బాటసారులకు , స్థానికులకు మినరల్ వాటర్ కూలింగ్ చలివేం ద్రాన్ని గురువారం నిర్వాహకులు సూరే నాగేశ్వరరావు గురువారం ప్రారంభించారు. గత 30 సంవత్సరాలకు పైగా ఈ చలివేంద్రాన్ని సూరే వెంకట సుబ్బారావు కుమారులు సూర్య వెంకటేశ్వర్లు, సూరే నాగేశ్వరరావు సప్తగిరి ట్రేడర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ చలివేంద్రం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆరేటి వెంకటేశ్వర్లు, రామయ్య, తీరం దాసు, శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌కు ఘనస్వాగతం

**కరీంనగర్ :** కరీంనగర్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ వినోద్ కుమార్, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, పుట్టా మధు, దాసరి మనోహర్ రెడ్డి, కోరుకంటి చందర్, సుంకె రవిశంకర్, బిగాల గణేష్, మాజీ ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణరావు, బీఆర్ఎస్ నాయకులు తుల ఉమ, రాకేష్, కొండూరి రవీందర్ రావు తదితరులు హాజరయ్యారు. తరువాత కేటీఆర్ మరియు ఇతర బీఆర్ఎస్ నేతలు జగిత్యాలకు బయలుదేరారు.

## విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ

## పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టి

**మధిర** : అక్షరమే ఆయుధంగా తెలంగాణ బిడ్డలు ప్రపంచంతో పోటీ పడేలా ఎదగాల న్నదే మా ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. గురువారం మధిర నియోజకవర్గంలోని బోనకల్లులో అమ్మ ఫౌండేషన్ సౌజన్యంతో విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను ఆయన పంపిణీ చేసారు. ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ విద్యా ర్థులు సులభంగా పాఠశాలకు చేరుకునేలా, వారి విద్యాభ్యాసానికి ఎటువంటి అంతరా యం కలగకుండా ముఖ్యంగా బాలికల విద్యకు ప్రాధాన్యత ఇస్తూ, వారి భవిష్యత్తును మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అంతరాలు లేని ఆదర్శ సమాజం కేవలం విద్యతోనే సాధ్యం. అందుకే రాష్ట్రంలో ఒకేసారి 100 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. అలాగే ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్'ను అందుబాటులోకి తీసుకువస్తున్నామని అన్నారు. పేద బిడ్డలు ఆకలితో చదువుకు దూరం కాకూడదని జూన్ 2 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకం, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తున్నాం. విద్యా రంగంలో మేము పెట్టే ప్రతి రూపాయి రేపటి తరాల ఉజ్వల భవిష్యత్తు కోసం చేసే గొప్ప పెట్టుబడని అన్నారు..

## డబుల్ బెడ్ రూమ్ పట్టాలు

## పంపిణీ చేసిన మంత్రి పొన్నం

**హైదరాబాద్** : కార్వాన్ ఎంకే ఎ కన్వెన్షన్ హాల్ లో బహుదూర్ పుర ,కార్వాన్ నియోజకవర్గాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు 2బీహెచ్కే పట్టాలు హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పంపిణీ చేపారు మంత్రి మాట్లాడుతూ డబుల్ బెడ్ రూం ఇళ్ల పట్టాలు పొందుతున్న లబ్ధిదారులకు శుభాకాంక్షలు. గతంలో చాలా సంవత్సరాలుగా డబుల్ బెడ్ రూం లు అడిగారు.. మిగిలిపోయిన పెండింగ్ పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూం లు అందిస్తున్నాం. మిగిలిన వారికి కూడా పట్టాలు పంపిణీ చేస్తాం. గత 10 ఏళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన ప్రభుత్వంలో నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశాం..ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే ఎప్పుడైనా రేషన్ కార్డులు పంపిణీ జరుగుతాయి.. ఇది నిరంతర ప్రక్రియ. రేషన్ కార్డులు మాత్రమే కాకుండా తినడానికి యోగ్యమైన సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని అన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నాం. ఆర్థికంగా ప్రజల మీద భారం పడకుండా ఉచిత కరెంట్ తో పాటు ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించాం. ఇప్పటి వరకు 300 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేసి 10 వేల కోట్ల రూపాయలు ఆదా చేసుకున్నారు. మహిళలంతా మెప్మా సంఘాల్లో చేరాలి. ప్రభుత్వం మహిళా సంఘాలకు వేల కోట్లు లోన్లు ఇస్తుంది. హైదరాబాద్ లో గ్రామీణ ప్రాంతాల్లో కంటే మహిళా సంఘాల సభ్యులు తక్కువ ప్రతి ఒకరు మహిళా సంఘం లో చేరాలి.. వారికి లోన్లు ఇచ్చి ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నాం. ప్రతి నియోజకవర్గంలో పల్లెటూరు లో 3500 ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం..5 లక్షల రూపాయలు అందిస్తున్నాం. త్వరలో హైదరాబాద్ లో స్థలం ఉన్న వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం..ఇప్పటికే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జిల్లా కలెక్టర్ లతో సమావేశం ఏర్పాటు చేశాం. స్లమ్స్ అభివృద్ధి చేసి స్థల సేకరణ చేసి ఇందిరమ్మ ఇళ్లు కడతాం. హైదరాబాద్ లో స్థలాలు ఇబ్బంది ఉంది దానికి కార్యాచరణ తీసుకున్నాం.. త్వరలోనే వారికి ఇల్లు ఇస్తాం. కొత్తగా 70 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చాం. అర్హత ఉన్న వారందరికీ ఎలాంటి వివక్ష లేకుండా డబుల్ బెడ్ రూం పట్టాలు అందిస్తున్నాం. ఎక్కడైనా పొరపాటు జరిగితే మా దృష్టికి తీసుకురండి .. పారదర్శకంగా డబుల్ బెడ్ రూం పట్టాలు అందించబడుతుందని అన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కాళాశాల నూతన భవనం ప్రారంభం

### పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

**హైదరాబాద్ :** విద్యా అనే ఆయుధాన్ని సరిగ్గా ఉపయోగించుకుంటే విద్యార్థులు తమ జీవితాలనే కాకుండా ప్రపంచాన్నే మార్చగలరని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. కూకట్పల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవనాన్ని ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి,

## గడ్డపోతారం పరిశ్రమలో అగ్ని ప్రమాదం



**సాల్వెంట్ డిస్టిలేషన్ ప్లాంట్‌లో మంటలు**
**సంఘటన స్థలానికి చేరుకున్న గడ్డపోతారం చైర్మన్ సుష్మ గణేష్, వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్, కౌన్సిలర్స్**




గడ్డపోతారం మున్సిపల్ ఏప్రిల్ 10 (అక్షర రేఖ న్యూస్)

సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం వద్ద న్యూట్రల్ కెమికల్ పరిశ్రమలో సాల్వెంట్ డిస్టిలేషన్ ప్లాంట్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఘటనతో పరిసరాల్లో కలకలం రేగగా, పారిశ్రామిక వాతావరణంలో ఆందోళన నెలకొంది. సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చే ప్రయత్నాలు ప్రారంభించారు. మంటలు చెలరేగిన కారణాలపై ఇంకా స్పష్టత రాలేదని తెలిసింది. ఇటీవలి రోజుల్లో పెరిగిన ఉష్ణోగ్రతలు, రసాయన పదార్థాల నిల్వలు వంటి కారణాలు ప్రమాదానికి దారితీసి ఉండవచ్చని భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న గడ్డపోతారం మున్సిపల్ చైర్మన్ సుష్మ గణేష్, వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్, మరియు కౌన్సిలర్లు, మరియు అధికారులు తదితరులు పాత్రికేయ సిబ్బంది మరియు గ్రామస్తులు రాజకీయవేత్తలు తదితరులు పాల్గొని ఘటన స్థలంలో జరిగిన సంఘటన పరిశీలించి పరిశ్రమల ఉన్న బాధ్యతలకు ఎవరికి కలకుండా చూడాలని అగ్నిమాపక సిబ్బంది పోలీస్ సిబ్బంది వెంటనే చేరుకొని దర్యాప్తు నిర్వహించడం జరిగింది ఇస్తామని పూర్తి విషయాలు దర్యాప్తు చేసి వెల్లడిస్తామని పోలీస్ సిబ్బంది తెరపడం జరిగింది

## టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో జెడ్.ఎస్ జైపాల్, "దళిత రత్న" కోటపాటి.రుక్మారావుకు ఘన సన్మానం

ఖమ్మం జిల్లా బ్యూరో అక్షర రేఖ న్యూస్ ఏప్రిల్ 10



టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో, టీఎన్జీవోస్ కేంద్ర సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ గా ఎన్నికైన జెడ్.ఎస్. జైపాల్ మరియు రాష్ట్ర ప్రభుత్వ "దళిత రత్న" అవార్డు గ్రహీత కోటపాటి రుక్మారావు లను ఘనంగా సన్మానించారు. శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా టీజీఈజేఏసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఏ టీజీవో రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ, జైపాల్ ఉద్యోగుల హక్కుల పరిరక్షణలో నిరంతరం పోరాడుతూ సంఘ బలోపేతానికి విశేష కృషి చేస్తున్నారు. ఆయన నాయకత్వం ఉద్యోగుల్లో ఐక్యత, నమ్మకాన్ని పెంపొందించింది అని ప్రశంసించారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వ "దళిత రత్న" అవార్డు గ్రహీత కోటపాటి రుక్మారావు విద్యార్థుల సంక్షేమం, సామాజిక సేవలో విశేష కృషి చేసి, ముఖ్యంగా పేద మరియు వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి అంకితభావంతో పనిచేస్తున్నారు. ఆయన సేవలు యువతకు ఆదర్శప్రాయంగా నిలుస్తాయి అని పేర్కొన్నారు. ఇలాంటి ప్రతిభావంతులైన నాయకులను సన్మానించడం ద్వారా సంఘం మరింత బలపడుతుందని, వారి సేవలు సమాజానికి దిశానిర్దేశం చేస్తాయని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో టీజీఈజేఏసీ ఖమ్మం జిల్లా చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు, టీజీవో జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరావు, కార్యదర్శి మోదుగు వేలాద్రి, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి కొనిదెన శ్రీనివాస్, అసోసియేటెడ్ ప్రెసిడెంట్ కొమరగిరి దుర్గాప్రసాద్, రెవిన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు తుంబూరు సునీల్ రెడ్డి, టీజీవో అసోసియేట్ అధ్యక్షులు మల్లెల రవీంద్ర ప్రసాద్, హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి విజయ్ కుమార్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరావు, పిఆర్టియు జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సుబ్బయ్య, హెడ్ మాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వీరాస్వామి, టీపీటీఫ్ కార్యదర్శి వెంగలరావు, యుటిఎఫ్ అధ్యక్షులు రంజాన్, టిఆర్టియు అధ్యక్ష కార్యదర్శులు శేఖర్, టీఎన్జీవోస్ మహిళా విభాగం చైర్‌పర్సన్ మృదుల, నాయకులు తాళ్లూరి శ్రీకాంత్, ఎర్రమళ్ళ శ్రీనివాసరావు, కోణార్, శ్రీధర్ సింగ్, కోడి లింగయ్య, వెక్కిరాల శ్రీనివాస్, మల్లోజు వెంకన్న, పొట్టపెంజర రామయ్య, డి ఆర్ డి ఏ.లక్ష్మణరావు, కెవి.రమణ, రవికుమార్, తాళ్లూరు చంద్రశేఖర్, గుడిపూడి శ్రీనివాస్, రమణ యాదవ్, ఎర్రమల శ్రీనివాస్, చంద్రశేఖర్ గౌడ్, ఎర్ర రమేష్, బెజ్జంకి ప్రభాకర చారి, మెట్టు వీరన్న, దిలీప్ కుమార్, విజయ్, అజ్మత్ బెగ్, గఫూర్, లింగం సురేష్ తదితరులు పాల్గొని సన్మానితులకు అభినందనలు తెలిపారు.

## మంచి రోడ్లు మెరుగైన భవిష్యత్తుకు బాటలు



**ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి**

అక్షర్ రేఖ రిపోర్టర్ ఏప్రిల్ 10 యాచారం

GHMC పరిధిలోని 52వ డివిజన్ పెద్ద అంబర్ పేటలో నూతన రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన =ఉదీ నుండి 13 కోట్లతో రోడ్లు నిర్మాణానికి శ్రీకారం. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజవర్గంలోని అభివృద్ధి పరుగులు పెడుతుంది =ఉదీ శాఖ నుండి 13 కోట్ల భారీ నిధులతో పెద్ద అంబర్పేటలో నూతన రోడ్ల నిర్మాణ పనులకు నేడు మన ప్రియతమ నాయకులు ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి. ఆర్ డి సి చైర్మన్ మల్రెడ్డి రాంరెడ్డి శంకుస్థాపన చేయడం జరిగింది పెద్దమ్మర్ పేటలో ఆధునిక మౌలిక వసతులతో అభివృద్ధి చేయాలని దృఢ సంకల్పంతో చేపట్టిన ఈ పనులు నియోజవర్గ ప్రగతికి మరో బలమైన నిదర్శనం గా నిలుస్తుంది. ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మన రంగన్న గెలుపు తర్వాత నియోజకవర్గం లో చాలా గ్రామాల్లో కాలునీలకు రోడ్ల అండర్ డ్రైనేజీ వ్యవస్థ చేరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి 15 సంవత్సరాల నియోజకవర్గంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉంది మన రంగన్న రాకతో నేడు ప్రతి గ్రామం పట్టణం అభివృద్ధి చెందుతున్నాయి కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు

## నాయకులు అక్రమ షెడ్లు వేస్తుంటే

## అధికారుల చర్యలు ఉండవా




**నాదర్గుల్ 373 ఎకరాల ప్రభుత్వ భూముల కబ్జాపై ఆగ్రహం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి**

అక్షర్ రేఖ రిపోర్టర్ ఏప్రిల్ 10 యాచారం

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ చంద్రారెడ్డికి పీరియడ్ చేసిన టిఆర్ఎస్ ఎమ్మెల్యే ఎమ్మెల్సీ మాజీ ఎమ్మెల్యేలు రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం చేరుకున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఎమ్మెల్యే వివేకానంద ఎమ్మెల్సీలు దాసో శ్రావణ్ వాణిదేవి మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అంజయ్య పట్నం నరేందర్ రెడ్డి నాదర్గుల్ 373 ఎకరాల ప్రభుత్వ భూముల అన్యాకాంతం విషయంపై అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డికి తెలియజేసిన బిఆర్ఎస్ నేతలు సర్వేనెంబర్ 673లో కొందరు కాంగ్రెస్ నేతల ఆక్రమాలు. 600 మంది రైతులకు బోన్స్ ర్ల గుండాలను అడ్డం పెట్టుకొని కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన మంత్రి కబ్జాలు చేస్తున్నారు ల్యాండ్ సీలింగ్ యాక్టర్ పరంగా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న కాంగ్రెస్ నేతలపై చర్యలు తీసుకోవాలని చుట్టూరా రేకులతో బార్కెట్లు నిర్మించి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు కోర్టుకు సంబంధించిన భూములలో రైతులకు సంబంధించిన బోర్లను పగలగొట్టడం వ్యవసాయం చేసుకొని రైతులను కొట్టి బయటికి పంపడం కాంగ్రెస్ నాయకులు ఎలా చేస్తారు ప్రభుత్వ భూముల్లో కాంగ్రెస్ నాయకులు అక్రమ షెడ్లు వేస్తుంటే అధికారులు చర్యలు ఉండవా స్థానిక ఆర్డిఓ కి ఫిర్యాదు చేస్తే కనీసం పట్టించుకోలేదు కోట్ల రూపాయలు ప్రభుత్వ భూములను కాపాడడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు

## నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి విరాళాలు అందజేత



**దైవభక్తితో ముందుకొచ్చి విరాళం అందజేసిన దాతలకు ఘన సన్మానం**
**పోచమ్మ తల్లి నీ దీవెనలు ప్రజలకు అందరికీ ఉండాలని వేడుకున్నారు**

జిన్నారం మున్సిపల్ ఏప్రిల్ 10 ( అక్షర రేఖ న్యూస్)

జిన్నారం మున్సిపల్ కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి దైవ భక్తితో మా వంతు సహకారం చేస్తామంటూ ముందుకొచ్చిన దాతలు కోపరేట్ బ్యాంక్ మాజీ చైర్మన్ శంకర్ రెడ్డి 50,000 వేల రూపాయలతో లైట్ వెయిట్ కరీంనగర్ ఇటుక అందజేత మూడో వార్డ్ కౌన్సిలర్ శంకరప్ప 50 బ్యాగుల సిమెంట్ అందజేత జంగంపేట్ నర్సారెడ్డి మాజీ వార్డ్ నెంబర్ 25 బ్యాగుల సిమెంట్ అందజేయడానికి ముందుకు వచ్చి దైవభక్తిలో అందజేయడం జరిగింది ప్రతి ఒకరు దైవభక్తితో తోచిన సహకారం అందజేయాలని భక్తి భావం పెంపొందించుకోవాలని వారు అన్నారు ఆలయ కమిటీ సభ్యులు బి ఆర్ ఎస్ పార్టీ సభ్యులు మాట్లాడుతూ ఎల్లప్పుడూ అమ్మవారి కృపా కటాక్షం అందరిపై ఉంటుందని సహకారం అందించడానికి ముందుకు వచ్చిన పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు అదేవిధంగా ఘనంగా సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న సభ్యులు వెంకటేశం గౌడ్ మాజీ ఎంపిటిసి శ్రీనివాస్ రెడ్డి మాజీ వార్డ్ మెంబర్ ఏర్పుల లింగం శ్రీనివాస్ గౌడ్ శ్రీధర్ గౌడ్ బ్రహ్మాం దర్ గౌడ్ నర్సింగ్ రావు యాదయ్య బిక్షపతి తదితరులు పాల్గొని ఘనంగా సన్మానించడం జరిగింది ఎల్లప్పుడు వారి కుటుంబాలకు పోచమ్మ తల్లి దీవెనలు ఉంటాయని వారు అమ్మవారిని వేడుకుంటున్నట్లు తెలిపారు

Printed, Published & Owned by V. SAI KRISHNAREDDY, Printed at SAI KRISHNA PRINTERS, Door No. 7-7-86/1, Near Collector Chowk, Adilabad (T.S) 504001 Published at H.No. 1-2-125/1, Pithruchaya Nilayam, Shanti Nagar, Adilabad-504001 (T.S) Editor: V. SAI KRISHNA REDDY, RNINO. TELTEL/2012/44706, CELL:7073352171, Email: aksharарekhadaily@gmail.com